ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5


ఆదివారం 30 నవంబరు 2025



గుర్తింపుతోనే.. సరి

అక్రమ కట్టడాలపై చర్యలు శూన్యం

- ప్రకటనల్లోనే కూల్చేస్తామన్న హెచ్చరికలు
- పురాల్లో బీపీఎస్ దరఖాస్తులు అరకొరగానే
- అనుమతించిన ప్లాన్లలో నిబంధనల అతిక్రమణ
- మామూళ్లతో కళ్లు మూసుకుంటోన్న మున్సిపల్ అధికారులు



నరసరావుపేటలో నిర్మించిన అపార్ట్‌మెంట్

బాపట్ల, చీరాల గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధంగా.. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా.. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా నివారించేలా.. భవన నిర్మాణాలు చేపట్టాలి. అందుకు మున్సిపాల్టీ, నగర పాలక సంస్థల నుంచి ముందస్తు అనుమతులు ఉండాలి. నిబంధనల ప్రకారం ప్లాన్ రూపొందించుకుని, దానికి (మిగతా 8వ పేజీలో)

ప్లాన్లు తీసుకుని కొందరు.. లేకుండా మరికొందరు యథేచ్ఛగా భవన నిర్మాణాలు చేస్తున్నారు. ఇంకొందరు పేరుకు ప్లాన్ తీసుకుని అందుకు పూర్తి విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు గుర్తిస్తున్నారే కానీ వాటిపై చర్యలు ఉండటంలేదు. మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో కళ్లెదుట అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం ఒకవైపు అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని సూచిస్తున్నా ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఒకవిధంగా అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాలతో పాటు గుంటూరు నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా భారీగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు తరచూ ప్రభుత్వం అవకాశం ఇస్తున్నా ఫలితం ఉండటం లేదు. అధికారులు, రాజకీయ నాయకుల అండతోనే అక్రమ నిర్మాణదారులు క్రమబద్ధీకరణకు ముందుకు రావడంలేదన్న ఆరోపణలు ఉంటున్నాయి.



గుంటూరు బ్రాడీపేట 4/14లో జరిగిన అక్రమ నిర్మాణం

గుంటూరులో 10 వేలకు.. 8 దరఖాస్తులు

గుంటూరు నగరంలో కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగు తున్నాయి. నగర పరిధిలో 10 వేలకు పైగా అక్రమ కట్టడాలు ఉండగా ఇటీవల వరకు 8 మంది మాత్రమే బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. జీఎంసీ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు కనిపిస్తాయి. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించు కోకపోతే కూల్చేస్తామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా నిర్మాణదారులు అంతగా లెక్క చేయడంలేదు. బీపీఎస్ దరఖాస్తుకు గడువు ముగిసిన వెంటనే అక్రమ భవనాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని, వాటిని కూల్చివేస్తామని జీఎంసీ సీపీ రాంబాబు తెలిపారు.



సమావేశం నిర్ణయాలను వివరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- రాజధాని రైతులకు రోడ్డు పోటు లేని ప్లాట్లు
- రెండో విడత సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని
- అమరావతి రైతుల సమస్యలపై త్రీమన్ కమిటీ సమీక్ష

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతుల సమస్యలను గుర్తించాం.. వాటి పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాజధాని రైతులతో తాడేపల్లిలోని పెమ్మసాని క్యాంపు కార్యాలయంలో త్రీమన్ కమిటీ రెండో విడత సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను పెమ్మసాని మీడియాకు వివరించారు. రాజధాని అమరావతిలో కొంతమంది రైతులకు గతంలో ఇచ్చిన రోడ్డు పోటు ప్లాట్లకి ప్రత్యామ్నాయంగా వాస్తుదోషం లేని నివేశన స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 156 మంది రైతులు వాస్తుదోషంపై ఫిర్యాదు చేశారని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. మెయిన్ రోడ్డు పెద్దదిగా ఉండి, కనెక్టింగ్ రోడ్డు చిన్నదిగా ఉన్న చోట్ల కమర్షియల్ ప్లాట్లు రోడ్డు పోటు కిందకు రావని అప్పట్లో అధికారులు చెప్పి కేటాయించారన్నారు. వాటికి కూడా ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేస్తున్నామన్నారు. ఎల్‌పీఎస్ స్కీమ్‌లో ఇంకా 2,492 ఎకరాల భూమి సీఆర్‌డీఏకి రావాల్సి ఉండగా 45 మంది రైతులు కోర్టు కేసులు వేశారని, వారితో మాట్లాడి 17 ఉపసంహరింపచేశామన్నారు. మిగతా 28 డిసెంబరు 3న కోర్టు (మిగతా 8వ పేజీలో)

లంక భూముల రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తాం

ఎన్‌జీటీ కేసుతో సంబంధం లేకుండా లంక భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియని ప్రారంభిస్తామని పెమ్మసాని చెప్పారు. అసైన్డ్ భూములపై కేబినెట్‌లో చర్చించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఇక నుంచి ప్రతీ రెండు వారాల కు ఒకసారి అమరావతి రైతులతో సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రైతులు ప్రస్తావిస్తున్న సమస్యలను పరిష్కరించడానికి సీఆర్‌డీఏ అధికారులకు నిర్దేశిత గడువుని విధించి రిపోర్టులు తెప్పించుకుం టున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.



కోతకు సిద్ధమైన వరి పైరు

దిత్వా.. ఎల్లో అలర్టు

- అన్నదాతల గుండెల్లో వణుకు
- నేడు, రేపు జిల్లాకు వర్ష సూచన
- ఊపందుకున్న వరి కోతలు.. కల్లాల్లో ధాన్యం

(బాపట్ల, వేమూరు ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల గాడిన పడుతుండగా.. దిత్వా హెచ్చరికలు అటు రైతులు, ఇటు అధికార యంత్రాంగంలో వణుకు పెడుతున్నాయి. వేల ఎకరాల్లో వరికోతలు పూర్తి కాగా కల్లాల్లో ధాన్యం రాశులు ఉన్నాయి. ఇదే సమయంలో దిత్వా తుఫాన్ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆది, సోమవారాల్లో జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుఫాన్ గండం నుంచి రైతులను గట్టెక్కించాలంటే ఆయా విభాగాలు సమన్వయంతో అడుగులేయాల్సి ఉంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తొలి ప్రాధాన్యంగా కల్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలించడంపైనే యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది. అదేవిధంగా సేకరణపై రైతుల్లో ఉన్న అపోహలు తొలగించడానికి యంత్రాంగం సమాయత్తం కావాల్సి ఉంది. తుఫాన్ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ టార్పాలిన్ పట్టాలతో పాటు గన్నీ సంచులను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. తేమ శాతంపై ఉదారంగా వ్యవహరించాలని ఇప్పటికే మిల్లర్లకు ఆదేశాలు అందాయి. కానీ అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో 30 శాతం మిల్లుల్లో కూడా డ్రయ్యర్లు లేకపోవడం మరింత ఆందోళన కలిగించేదిగా ఉంది. కేవలం 18 మిల్లుల్లోనే డ్రయ్యర్ల సదుపాయం ఉన్నట్లు తెలుస్తోంది. అంచనాలకు మించి తుఫాన్ జిల్లాపై ప్రభావం చూపిస్తే తేమ శాతం విషయంలో మరింతగా గందరగోళం తలెత్తే ప్రమాదాలు కనబడుతున్నాయి.

కమ్మేసిన మబ్బులు.. రైతుల్లో ఆందోళన

శనివారం సాయంత్రానికి మబ్బులు పూర్తిగా కమ్మేశాయి. దీంతో రైతులు హడావుడిగా హార్వెస్టర్‌పై నూర్పిడి చేస్తున్నారు. కాగా కోత కోసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవకాశం లేక ఆందోళన చెందుతున్నారు. కాగా రోడ్లు, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తేమ శాతం నిబంధనతో అమ్మలేని స్థితిలో ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మరోవైపు కోతకు సిద్ధమైన పైర్లను నిలువుపై హార్వెస్టర్ల ద్వారా నూర్పిడి చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ వాతావరణం సక్రమంగా లేకపోవడంతో పాటు హార్వెస్టర్ కొరతతో రైతులు అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షం పడితే కోతకు సిద్ధమైన పైర్లు కూడా పూర్తిగా దెబ్బతింటాయని వాపోతున్నారు. జొన్న, మొక్కజొన్న మొలకల దశలో ఉన్నాయని వర్షం పడితే ఎదుగుదల ఆగిపోయి నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

పల్లెల్లోనూ.. అన్న క్యాంటీన్లు

- మూడు జిల్లాలకు ఐదు మంజూరు
- శరవేగంగా నిర్మాణం.. 300 మందికి ఆహారం



నరసరావుపేట: నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్

భట్టిప్రోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పేదల ఆకలి తీరుస్తూ వివిధ వర్గాల నుంచి ఆదరణ పొందుతున్న అన్న క్యాంటీన్లు ఇక నుంచి పల్లెల్లోనూ సేవలు అందించనున్నాయి. గ్రామీణ ప్రాంతాల పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఐదు అన్న క్యాంటీన్లు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నామమాత్రపు ధరకే టిఫిన్, భోజనం అందించేలా 2019కి ముందే గత టీడీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే వాటిని వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ఈ నిర్ణయం పేదల కడుపు కొట్టడమేనని పలువురు విమర్శించినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునరుద్ధరించింది. నిత్యం మూడు పూటలా వందల సంఖ్యలో పేదలు ఇక్కడ ఆహార పదార్థాలతో కడుపు నింపుకుంటున్నారు. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లకు పెద్దఎత్తున ఆదరణ లభించడంతో పాటు విరాళాలు కూడా వస్తున్నాయి. దీంతో ఇంతకాలం పట్టణ కేంద్రాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను పల్లెలకూ విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీలు ఉండే పల్లెల్లో రూరల్ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుంది. ఈ క్యాంటీన్ల ద్వారా నిత్యం 300 మందికి భోజనం అందించేలా నిర్వహించనున్నారు.

మంజూరు ఇలా..

- పల్నాడు జిల్లా : పెదకూరపాడు
- గుంటూరు జిల్లా : మంగళగిరి, ప్రత్తిపాడు, ఫిరంగిపురం
- బాపట్ల : భట్టిప్రోలు

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, హాజరైన కౌన్సిలర్లు

అద్దంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన మొక్కుబడిగా సాగింది. ఇరు పక్షాల సభ్యులు ఎలాంటి చర్చలో పాల్గొనకుండ మౌనంగా ఉండిపోయారు. అజెండా లోని 18 అంశాలు చదవడం పూర్తయిన తర్వాత ఆమోది స్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. గత కౌన్సిల్ సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావిస్తూ కౌన్సిలర్లు హుందాగా వ్యవ హరించాలని 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్లు పద్మేష్, అనంతలక్ష్మి, కమిషనర్ రవీంద్ర, మేనేజర్ రవీంద్ర, ఏఈ లోకేశ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- రైతన్నా మీ కోసంలో ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పరిధిలోని వెల్లటూరులో శనివారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులకు ఆర్థిక భద్రతతో పాటు వ్యవసాయ పెట్టుబడిగా అన్నదాత సుఖీభవ పథకం దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఏటా ఈ పథకం మూడు విడతలుగా రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసకుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు, నాయకులు కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, వేములపల్లి జగన్నాథం, నూతక్కి దినకర్, పాల్గొన్నారు.



వెల్లటూరులో రైతన్నా మీకోసంలో ఎమ్మెల్యే ఆనందబాబు

1, 2న మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెప్మా, ఎన్‌యూహెచ్‌ఎం ఆధ్వర్యంలో మహిళలకు వైద్య శిబిరం బాపట్ల అంబేద్కర్ భవనంలో సోమవారం, మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మైనింగ్ సీనరేజ్‌పై ఆందోళన

- వసూళ్లపై వేమవరం జంక్షన్‌లో ధర్నా
- యజమానులతో ఏఎంఆర్ ప్రతినిధుల వాగ్వివాదం



మైనింగ్ సీనరేజ్ వసూళ్లు చేస్తున్న ఏఎంఆర్ కంపెనీకి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేస్తున్న గ్రానైట్ పరిశ్రమల యజమానులు, కార్మికులు

బల్లికురవ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన మైనింగ్ సీనరేజ్ వసూళ్లపై గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. ఏఎంఆర్ కంపెనీ సీనరేజ్ వసూళ్ల ప్రక్రియను నిరసిస్తూ మండలం వేమవరంలోని ఏఎంఆర్ కంపెనీ చెక్‌పోస్టు వరకు శనివారం ప్రదర్శన చేశారు. అనంతరం జంక్షన్‌లో ధర్నా చేశారు. ఈ క్రమంలో గ్రానైట్ యజమానులతో కంపెనీ సిబ్బంది వాదనకు దిగారు. దీంతో రెండు చెక్‌పోస్టు బాక్సులను ఆందోళనకారులు రోడ్డు మార్జిన్‌లోకి నెట్టేసి అక్రమ వసూళ్లు నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. సుమారు ఆరు వందల మంది ఫ్యాక్టరీల యజమానులు, కార్మికులు రోడ్డుపైకి చేరడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఇదే రోడ్డులోని మరి కొన్ని చెక్‌పోస్టు బాక్సులను పడేయాలని వెళ్తున్న ఆందోళనకారులను సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్‌ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య, సైదాలు అడ్డుకున్నారు. కంపెనీ ప్రతినిధులను చర్చలకు పిలుస్తామని హామీ ఇవ్వడంతో యజమానులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా యజమానులు మాట్లాడుతూ నాసిరకమైన ముడి సరుకు కూడా ఫస్ట్‌క్వాలిటీ మెటీరియల్‌కు మాదిరిగా సీనరేజ్ వసూలు చేస్తే తాము నష్టపోతామన్నారు. అక్రమ వసూళ్లకు అడ్డు కట్ట వేసి పరిశ్రమలను కాపాడాలని లేకుంటే పరిశ్రమలు పూర్తి స్థాయిలో మూత తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, నాగరాజు, పత్తిపాటి సురేష్, నేతలు పెయ్యల రంగనాథ్, యిటూరి ఆంజనేయులు, పుచ్చకాయల సుబ్బరామయ్య, కొర్రపాటి వేణు, కొండూరి నాగయ్య, జూపల్లి సింగయ్య, శ్రీనాధ్, రామరాజు, లేమాటి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అసోసియేషన్ నాయకుల చర్చలు

మార్టూరు: బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, మైనింగ్ ఏడీ రామచంద్రయ్య సమక్షంలో శనివారం సాయంత్రం మార్టూరు స్టేషన్‌లో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు, ఏఎంఆర్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ధర్నా సందర్భంగా పోలీసులు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్చలు నిర్వహించగా ఒక కొలిక్కి రాలేదు.



ఏఎంఆర్ కంపెనీ ప్రతినిధిని చుట్టు ముట్టిన యజమానులు, కార్మికులు

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు
ఉపేక్షించేది లేదు

- పౌర సరఫరాలశాఖ మంత్రి మనోహర్



చెరుకుపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

6

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు ఉపేక్షించేది లేదు

- ప్రతి వరి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- పౌర సరఫరాలశాఖ మంత్రి మనోహర్

రేపల్లె, చెరుకుపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం వాటిల్లేలా మిల్లర్లు, వ్యవసాయశాఖాధికారులు వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. శనివారం చెరుకుపల్లి, నడింపల్లి, గూడవల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రభుత్వం నిర్ణయించిన రూ.1,792ల మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉందని రేట్లు తగ్గిస్తే సహించేది లేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఇబ్బందులు కలిగించినా.. కొనుగోళ్లలో అవకతవకలు జరిగినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్న మంత్రి.. నడింపల్లి గ్రామంలో ఇలా రైతుల ఖాతాల్లో రూ.17లక్షలు పైనే జమ అయ్యిందని ఉదహరించారు. బాపట్ల జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని.. వ్యవసాయశాఖాధికారుల అంచనాలు 3లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నట్లు చెప్పారు. సంక్రాంతి లేదా మార్చి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మంత్రి మనోహర్ వెల్లడించారు. ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ ఢిల్లీరావు, కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ భావన, ఆర్డీఓ రామలక్ష్మి, ఏడీఏ లక్ష్మి, టీడీపీ నాయకులు అనగానిశివప్రసాద్, తాతా ఏడుకొండలు, గోగినేని వసుధ, మండవ తాతాజీ, ఎంఆర్‌కే మూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలోని రాయల్ రైతు ఆగ్రోస్ రైస్ మిల్లును శనివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులోని బియ్యం నిల్వలను పరిశీలించారు. మిల్లింగ్ ఆడుతున్న బియ్యంను పరిశీలించి రేషన్ బియ్యం కాదా అని తనిఖీలు చేశారు. రైస్ మిల్లర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని లేదంటే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



మునిపల్లె మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఆఫ్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలు

కొల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లుగా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ ఎండీ ఢిల్లీరావు, జేసీ భావనతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లర్ల దగ్గర ఉన్న తేమ శాతం పరికరాల్లో ఐదారు శాతం వ్యత్యాసం చూపుతోందని టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న తేమశాతం పరికరాన్ని నాదెండ్ల పరిశీలించారు. అనంతరం కొల్లూరులోని రైస్‌మిల్లులో తేమ శాతం పరికరాన్ని పరిశీలించి.. వ్యత్యాసం సమస్యగా గుర్తించారు. నిపుణులతో లోపాలను సరి దిద్దుతామని చెప్పారు. ధాన్యం మిల్లులకు చేరవేసేందుకు 55 లారీలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డిక్లరేషన్ ఇచ్చిన ప్రకారం ప్రతి మిల్లర్ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు అవసరమైన గోతాలను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు.

బావిలో యువకుడి మృతదేహం

తాడేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనుమాక కృష్ణాయపాలెం రోడ్డు వెంబడి పంట పొలాల్లో ఉన్న పాడుబడిన బావిలో యువకుడి మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు శనివారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని బయటకు తీయించి వివరాలు సేకరించినట్లు ఎస్‌ఐ ఖాజావలి తెలపారు. మృతుడు మంగళగిరి పట్టణం కొత్తపేటకు చెందిన పిన్నిక ఆనంద్ (24)గా గుర్తించారు. ఈ నెల 27న ఆనంద్ అదృశ్యమవగా బావిలో విగతజీవిగా కనిపించాడు. మృతుడు ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తాడని, అతని సోదరుడు నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా అతని మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుని ఒంటిపై గాయాలున్నట్లు చెబుతున్నారు.



ఆనంద్ (ఫైల్ ఫొటో)

షర్మిలతో పొన్నూరు కాంగ్రెస్ నాయకుల భేటీ

పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని శనివారం పొన్నూరు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ చీఫ్ షర్మిళ విజయవాడ రావడంతో పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిసి పొన్నూరులో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై వివరించారు. నియోజకవర్గం కోఆర్డినేటర్ నాగేశ్వరరావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 2వ తేదీన ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్య రెడ్డి, అధ్యక్షతన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంఘటన శ్రీ జన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ నాయకులకు షర్మిళ సూచించారు. ఈ కార్యక్రమంలో అందే దిలీప్ తరఫున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



షర్మిలారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పొన్నూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎల్.వీరానాయక్ కథనం ప్రకారం కసుకర్రు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు పూరుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఆచూకీ తెలిసినవారు 94407 96172, 9676 262840 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ కోరారు.



మృతదేహం

ఏఎన్‌యూలో ముగిసిన నైపుణ్య శిక్షణ సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో నాలుగు రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. సివిల్ మెకానికల్ బ్లాక్‌లోని టీసీఎస్ ఆన్‌లైన్ సెంటర్‌లో మైక్రోసాఫ్ట్, కొనిక్ సొల్యూషన్స్ హాండ్స్ ఆన్ పవర్ బీ ఐ వర్క్‌షాప్ జరిగింది. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులు మైక్రోసాఫ్ట్ అందించే స్పాన్సర్ పవర్ బీ ఐ ట్రైనింగ్ ద్వారా స్కిల్స్‌ను మెరుగు పరుచుకోవాలన్నారు. తమ విభాగాల్లో ఈ కోర్సులను అన్వయించుకుని సాధన చేయాలని చెప్పారు. విద్యార్థులు డేటా, బిజినెస్ అనలిస్ట్ తదితర ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశాలున్నాయన్నారు. వర్సిటీ యాజమాన్యం విద్యార్థులకు నైపుణ్యం విషయంలో రాజీ పడదన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శి.లింగరాజు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లన్నారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ మాట్లాడుతూ శిక్షణ అందించిన మైక్రోసాఫ్ట్, కొనిక్ సొల్యూషన్స్. వర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు రిజిస్ట్రార్ సింహాచలం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ డి. చంద్రమౌళి, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ కె.చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్స్ అందజేస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

మనసుకు స్వాంతన చేకూర్చే..

ఉత్సవాలు అభినందనీయం

- అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

తెనాలి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో మనిషికి స్వాంతన చేకూర్చే ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో స్వరలయ వేదిక ఉత్సవాలను శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. వేదిక వ్యవస్థాపకులు సాయి లక్కరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెనాలి ప్రజలకు మంచి సంగీత కార్యక్రమాలను ఈ వేదిక అందిస్తోందన్నారు. కవులు, కళాకారులకు నిలయమైన పట్టణంలో కళా రంగాన్ని ప్రోత్సహిస్తున్న దాతలను అభినందించారు. జేపీసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, విజయవాడ దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు తోటకూర వెంకటరమణరావు, సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. వివిధ రంగాల్లో పేరుగాంచిన నిర్మలా రమేష్, కాటూరి వెంకటేశ్వరరావు, ధర్మారావు, దీపాల సత్యనారాయణ, బాబురావు, శాస్త్రి, బ్రహ్మాచార్యులు, రామాంజనేయప్రసాద్, నాగమణి, ప్రభాకర్, పద్మజా ప్రభాకర్, అబ్దుల్ రజాక్, రామకృష్ణను ఘనంగా సన్మానించారు. తెనాలి ఉత్సవ గీతం, కూచిపూడి నృత్య ప్రదర్శన, తెనాలి వైభవం నృత్యం, కోలాట ప్రదర్శనలు అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట బైపాస్ రోడ్డు వల్లపు చెరువు వద్ద ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశాస్తు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ వివరాల మేరకు.. నరసరావుపేట మండలం రాయపాడు గ్రామానికి చెందిన పెదకొండయ్య(35) శుక్రవారం రాత్రి బైక్‌పై ప్రయాణిస్తూ వల్లప్ప చెరువు వద్ద బైపాస్ రోడ్డు మలుపులో అదుపుతప్పి పడ్డాడు. స్థానికులు నరసరావుపేట వైద్యశాలకు అతనిని తరలించగా శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా..వ్యక్తి మృతి

రెంటచింతల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రెంటచింతలకు సమీపంలోని గొట్టిముక్కల మేజర్ వద్ద ఆటో బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. గురజాలలో క్యాటరింగ్ పనులు ముగించుకుని రెంటచింతలకు ఆటో వస్తోంది. ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో దాన్ని తప్పించబోయిన డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో రెంటాల గ్రామానికి చెందిన ఆడెపు మరియదాసు(32) తీవ్రంగా గాయ పడగా.. గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి చెందాడు. మృతుడికి భార్య దుర్గమ్మ, ఇద్దరు సంతానం.మరో ఇద్దరు ప్రమాదంలో గాయపడ్డారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు.

పిన్నెల్లి సోదరుల పాపం పండింది

- ఎమ్మెల్యేబ్రహ్మానందరెడ్డి



మాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలను హింసించి హతమార్చి ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసిన వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల పాపం పండిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అధికారం అడ్డుపెట్టుకొని కన్నుమిన్నూ కానకుండా పేట్రేగిపోయిన అరాచకశక్తి పిన్నెల్లి కుటుంబం అని ఆరోపించారు. సుప్రీంకోర్టు శుక్రవారం పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిందన్నారు. వారికి జైలు శిక్ష తప్పదన్నారు. మాచర్ల ప్రజలు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న న్యాయం దగ్గరలోనే ఉందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల నియోజకవర్గాన్ని రావణకాష్టంగా మార్చేసి తాలిబన్లలా ప్రతిపక్షాలు, ప్రజలపై దారుణ దమనకాండకు తెగబడ్డ దౌర్జన్యకారులు పిన్నెల్లి సోదరులని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ వనరులన్నింటిని దోచుకున్నారని, మాఫియాను నడిపించారని, నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం లేకుండా నిర్మూలించాలన్నట్లుగా బరితెగించారని విమర్శించారు. ఎందరో టీడీపీ కార్యకర్తలు దారుణ హత్యకు గురయ్యారన్నారు. జగన్‌రెడ్డి అండతో వ్యవస్థలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకొని పెట్రేగిపోయారన్నారు. మాచర్లలో గత ఐదేళ్లలో పిన్నెల్లి రాజ్యాంగం, చట్టమే అమలైందన్నారు. అక్రమ వ్యాపారాలు, భూదందాలు, గనుల అక్రమ తవ్వకాలతో పెద్ద ఎత్తున దోపిడికి పాల్పడ్డారన్నారు. పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేశారన్నారు. సీఐ పైనే హత్యాయత్నం చేసి బరితెగించారన్నారు. వంద గుడ్లు తిన్న రాబందు ఒక్క గాలివానకు నేలకూలిందన్న సామెత పిన్నెల్లికి అతికినట్లు సరిపోతుందన్నారు.

రేపటి నుంచి సూర్యలంకలో క్షిపణి పరీక్షలు

బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం అడవి రెవెన్యూ గ్రామ పరిధిలో సూర్యలంక సముద్రతీరం నందు భారత వైమానిక దళం భూమి ఉపరితలం నుంచి ఆకాశంలోకి గైడెడ్ ఆయుధాల ప్రయోగ శిక్షణ, పరీక్షలు నిర్వహించనుంది. డిసెంబరు ఒకటి నుంచి 5వ తేదీ వరకు ఆయుధ పరీక్షలు జరుగుతాయని.. బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తేదీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు రక్షణ మంత్రిత్వశాఖ ది. సీవార్డ్ ఆర్టిలరీ ప్రాక్టీస్ యాక్ట్ 1949..ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం శిక్షణకు అనుమతి జారీ చేసిందని చెప్పారు. సూర్యలంక సముద్రతీర ప్రాంత నివాసితులు వైమానిక స్టేషన్‌వైపు వెళ్లవద్దని సూచించారు.

రాజధాని పనుల కోసం ఐదుగురు డిప్యూటీ కలెక్టర్లు

- జీవో జారీ చేసిన సీఎస్ విజయానంద్

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల నిమిత్తం ఐదుగురు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం ఆదేశాలు జారీ చేశారు. బి.గాయత్రీదేవి, కె. లలిత, ఎస్.విజయలక్ష్మి, కె.రాజగోపాలరావు, తిరువీధుల రాధికను పురపాలక శాఖ, పట్టణాభివృద్ధి విభాగంలోని ఏపీ సీఆర్డీఏకి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా నియమించారు.

పీజీ పరీక్షలో ప్రతిభ చాటిన మంగళగిరి విద్యార్థి

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యలో మంగళగిరి సాయినగర్‌కు చెందిన పాపన జితేంద్ర రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను చాటారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం తాజాగా విడుదల చేసిన పోస్టు గ్రాడ్యుయేషన్ ఫలితాల్లో జితేంద్ర ప్రథమ స్థానంలో నిలిచారు. నగరానికి చెందిన జితేంద్ర ఆర్థోపెడిక్ విభాగంలో 800 మార్కులకు గాను 568 మార్కులను సాధించి.. రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచారు. జితేంద్ర ఏలూరు జిల్లా ఆశ్రమ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఆశ్రమ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎం మల్లికార్జునరెడ్డి ప్రభృతులు జితేంద్రకు అభినందనలు తెలిపారు.



పాపన జితేంద్ర(ఫైల్)

అమరావతిలో పొట్టిశ్రీరాములు..

58 అడుగుల కాంస్య విగ్రహం

- ఆర్యవైశ్య సంఘం సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ రాకేష్



సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ రాకేష్

వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల చిరకాల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహానికి సన్నాహలు చేస్తోందని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ డుండి రాకేష్ తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని గుర్తించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో సుమారు 6.8 ఎకరాల విస్తీర్ణంలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు 58 అడుగుల ఎత్తు గల ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిపాదించడం హర్షణీయమన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఆర్యవైశ్యులందరూ ముక్తకంఠంతో ఏకతాటిపై నడవాలని పిలుపునిచ్చారు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఆర్యవైశ్యులు కులదేవత వాసవి అమ్మవారి ఆత్మార్పణం చేసుకున్న పెనుగొండను వాసవి పెనుగొండగా మారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, పక్షం రోజుల్లో ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా స్మృతి వనం లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఆయన వెంట పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పెనుగొండ శ్రీనివాసరావు, అత్తులూరి సుబ్బారావు, మోటమర్రి నరసింహారావు, పువ్వాడ రామకృష్ణ ప్రసాద్, గట్టుపల్లి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, గజవల్లి నాగపవన్‌కుమార్, మండవ వెంకట కిరణ్‌కుమార్, రెడ్డి వెంకటరత్నం, సాయికుమార్, కాసుల వెంకట రవీంద్ర, గుడిపాటి శేష పద్మజ, పెండ్యాల సురేష్ బాబు, రెడ్డి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

260 మంది యువతకు ఉద్యోగవకాశాలు

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారాలోకేశ్ చొరవతో వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగాజాబ్ మేళా విజయవంతమైంది. 260 మంది యువతకు ఉద్యోగవకాశాలను కల్పించినట్టు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి కె.సంజీవరావు తెలిపారు. మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 510 మంది అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపత్రాలను అప్పటికప్పుడే అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కనీసం 20లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలను కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని చెప్పారు. సీడాప్ జేడీఎం రాంబాబు మాట్లాడుతూ తదుపరి జాబ్ మేళాకు ఉద్యోగవకాశాలను పొందవచ్చునని మిగిలిన అభ్యర్థులకు సూచించారు. మెప్మా పీడీ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు పల్లబోతుల శ్రీనివాసరావు, కేసంనేని శ్రీఅనిత, తాళ్ల అశోక్‌కుమార్‌యాదవ్, వాసా పద్మ తదితరులు పాల్గొన్నారు.



యువతికి నియామక పత్రం అందజేత

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00



మృతుని కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కార్యకర్తల సంక్షేమానికి కోట్లు ఖర్చు చేసిన ఘనత టీడీపీదే

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఏఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఘన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెలుగుదేశంపార్టీ ప్రమాద బీమా రూ.100తో సభ్యత్వ నమోదు చేసుకొని ప్రమాదవశాత్తు బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కోమట్ల దుర్గారెడ్డి మరణించగా వారికి తెలుగుదేశం పార్టీ రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రాన్ని మృతుని కుటుంబ సభ్యులకు శనివారం ఆయన అందజేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. పసుపు సైన్యం సంక్షేమం కోసం వందల కోట్లు వెచ్చించిన తెలుగుదేశం పార్టీ రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం టీడీపీ నాయకులు నక్కల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీర్ కళాశాలలో విద్యార్థుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

బాపట్లరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా జ్యోతి ప్రజ్వలనతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ప్రారంభించారు. సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్లను విద్యానందనంగా తీర్చిదిద్దిన విద్యాప్రదాత ముప్పలనేని శేషగిరిరావు ఆశయాలకు అనుగుణంగా అత్యుత్తమ విద్యాబోధనే పరమావధిగా ప్రయత్నిస్తున్నామన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించటంలో సొసైటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు పారెపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని వారి తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించటంలో తమవంతు కృషి తప్పకుండా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ జె.ఎస్.రావు, డీన్ ఆర్అండ్డి డాక్టర్ బి.చంద్రమోహన్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు, ఇంగ్లీష్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీఎన్ మల్లేశ్వరరావు, ఫిజిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ వి.అరుణ, కెమిస్ట్రీ హెచ్‌వోడీ సీహెచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలనతో సమావేశాన్ని ప్రారంభిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఎన్‌సీసీడే వేడుకలు

బాపట్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో శనివారం ఎన్‌సీసీడే వేడుకలు ఘనంగా నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా సుబేదార్ సురేంద్రసింగ్, చంద్రప్రకాష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ మూర్తి మాట్లాడుతూ ఎన్‌సీసీ విశిష్టత, ప్రాముఖ్యత, సమాజంలో విద్యార్థి దశలో ఎన్‌సీసీ పాత్ర తదితర విషయాల గురించి ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు వివరించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్‌సీసీ విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి, ముఖ్యఅతిథులు

జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు శనివారం స్థానిక బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆటల పోటీలను నిర్వహించగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ముందుగా పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్‌అధికారి బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఆటలపోటీలను నిర్వహించారు. జిల్లా స్థాయిలో అన్ని మండలాల నుంచి సుమారు 250 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు పాల్గొనటం జరిగిందని బాపట్ల డీఈవో ఎస్.పురుషోత్తమరావు తెలిపారు. ఈ ఆటల పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలుగా చేసి రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ వంటి ఆటలు నిర్వహించి గెలుపొందిన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయటంతో పాటు సర్టిఫికెట్స్ అందించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈడీ కోఆర్డినేటర్ జోత్స్న, సమగ్రశిక్ష అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో పురుషోత్తమరావు

డిసెంబరు 5లోపు సర్వే పూర్తి చేయాలి : డీఈవో

బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 5వ తేదీలోపు ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసి అసెస్‌మెంట్ ఆన్‌లైన్ సర్వే పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబరు 5వ తేది మెగా పేరెంట్స్ సమావేశం జరిగే నాటికి ఈ కార్యక్రమం ముగించాలన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థుల వరకు జరిగే ఈ బృహత్తర కార్యక్రమంలో డైట్ కళాశాల విద్యార్థులు, సీఆర్‌ఎంటీలు వంటి థర్డ్‌పార్టీ వారితో ఈ అసెస్‌మెంట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. జిల్లాలోని 1234 పాఠశాలల్లోని 35,710 మంది విద్యార్థుల విద్యాసామర్థ్యాలు ఎలా ఉన్నాయో దీనితో తెలుసుకోవటం జరుగుతుందన్నారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తికి తీవ్రగాయాలు

బాపట్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి కాలుకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... చీరాలకు చెందిన నాగేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై చీరాల నుంచి బాపట్ల వైపునకు వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దిత్వా తుఫాన్ ఎదుర్కోవటానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ఎదుర్కోవటానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. దిత్వా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో శనివారం ఆయన వీక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదన్నారు. ఆమేరకు మత్స్యశాఖాధికారులు, పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని తాకుతూ తుఫాన్ వెళుతుందన్నారు. బాపట్ల జిల్లా వరకు తుఫాన్ తాకిడి ఉండవచ్చునన్నారు. బాపట్ల జిల్లాకు భారీవర్ష సూచన ఉందన్నారు. తుఫాన్ తీరం దాటే వరకు ఆయాశాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం అధికమైతే పంటకాల్వలు గండుపడే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాలలో ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పంటకాల్వలపై ఉన్న కల్వర్ట్‌ల వద్ద పూడికతీత పనులు చేపట్టాలని, గుర్రపుడెక్కలను తొలిగించాలన్నారు. భారీవర్షాలకు విద్యుత్‌తీగలు, స్తంభాలు దెబ్బతింటే తక్షణమే సహాయకచర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి పథకాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని పౌరసరఫరాల శాఖాధికారికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థుల సంరక్షణను పరిశీలించి యుద్ధప్రాతిపదికన నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో గంగాధర్‌గౌడ్, ఆయాశాఖల జిల్లా, డివిజన్,మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ అత్యంత వేగంగా చేపట్టాలి

ధాన్యం సేకరణ ప్రక్రియ అత్యంత వేగంగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదుపై ఆరా తీశారు. రైతులు నుంచి వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారాలపై సమీక్షించారు. టోల్‌ఫ్రీ నెంబరు, కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరు పనితీరుపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది మరింత అప్రమత్తతో పని చేయాలని పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన గోనెసంచులు అందించే బాధ్యత పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌పై ఉందన్నారు. రైస్‌మిల్లర్‌ల యజమానుల బ్యాంక్‌ల పూచికతను పౌరసరఫరాలశాఖ అధికారి చూచుకోవాలన్నారు. భారీవర్షాలు ఉన్నందున ధాన్యం పంట కోయవద్దని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒకవేళ ఇప్పటికే పంటకోత జరిగితే తక్షణమే రైతు సేవా కేంద్రాలలో ధాన్యం సేకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో జమీర్‌బాషా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మీ, సంబంధితాధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా తదితరులు

మనుషుల మధ్య వివక్ష ఉండరాదు : ఆర్డీవో

కర్లపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కుల, మత, వర్గ, వర్ణ పరంగా మనుషుల మధ్య వివక్ష ఉండరాదని అందరూ కూడా ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆర్డీవో గ్లోరియా అన్నారు. కర్లపాలెం మండలం నర్రావారిపాలెం ఎస్టీకాలనీలో శనివారం జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇంకా ఎవరికైనా లేనట్లైతే దరఖాస్తులు చేసుకోవాలని కాలనీవాసులకు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే చట్టాలు ఉపయోగించుకొని రక్షణ పొందాలని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్‌పాషా, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సీఐ హరికృష్ణ, ఎస్ఐ శివకుమార్, సోషల్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మాజీపురం గ్రామంలో...

బాపట్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ ప్రజలు వివిధ ఆర్టికల్స్, హక్కులపై అవగాహన కలిగియుండాలని సోషల్ వెల్ఫేర్ డీడీ రాజాదోబెరా అన్నారు. బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ మహాత్మాజీపురం గ్రామంలో సివిల్ రైట్స్ కార్యక్రమాన్ని శనివారం బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం నుండి లభిస్తున్న సేవలను గురించి తెలుసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై అవగాహన కలిగియుండాలన్నారు. బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు, డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ, విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ కోటేశ్వరరావు, వెస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి చదలవాడ రవికుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ డీడీ రాజాదోబెరా అధికారులు

నేడు ఉచిత వైద్యశిబిరం

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విజయ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బాపట్ల పట్టణం బేతనీకాలనీలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు బేతనీ కాలనీ సంఘ పెద్దలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్నిరకాల వ్యాధులు, వైద్యపరీక్షలు, ఈసీజీ, రక్తపరీక్షలు అనుభవజ్ఞులైన వైద్యులచేత నిర్వహించటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలు ప్రారంభం

పిట్టలవానిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభించారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం త్రోబాల్, క్రికెట్ ఆటల పోటీలను నిర్వహించి మండల స్థాయి టీంను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖాధికారులు శివబాబు, రాజారత్నం పాల్గొన్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లా తెలిపారు. ఈ పోటీలలో మంతెనవారిపాలెం, చందోలు, అల్లూరు, పిట్టలవానిపాలెం ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు రాము, నాగలక్ష్మీ, రవికృష్ణ, ఈ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించారు. మండల క్రికెట్ టీమ్‌కు అల్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పద్మారావు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాపట్లలో కోతుల బెడదకు బోన్లు ఏర్పాటు



విజయలక్ష్మీపురంలో మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన బోన్లు

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక పరిధిలో కోతులబెడద ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలు నుంచి అనేక ఫిర్యాదులు వస్తుండటంతో కమిషనర్ జి.రఘునాథరెడ్డి సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. పట్టణంలో ఉన్న కోతులను తొలిగించేందుకు కోతులను పట్టేవారిని ఏర్పాటు చేసి కోతులు అధికంగా సంచరించే విజయలక్ష్మీపురం తదితర ప్రాంతాలలో బోనులు ఏర్పాటు చేసి కోతులను తరలిస్తున్నారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఎవరూ కూడా కోతుల వలన ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని తెలిపారు.

వంటకాలపై విద్యార్థులలో అవగాహన పెంపొందించాలి

చెరుకుపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుళ్ళపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో వృత్తి విద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్స్ ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఆహార పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత, సంప్రదాయ వంటకాలపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కవిత అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన జీడీడీవో చారులత విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఈవిధమైన నైపుణ్యత ఆధారిత కార్యక్రమాల్లో పాల్గొనడం వలన మరింత చురుకుదనాన్ని పొందుతారన్నారు. వృత్తి విద్య ట్రైనర్ బి.ధ్యాన్‌చంద్ విద్యార్థులకు వివిధ వంటకాలు తయారు చేయడం, వాటి ప్రదర్శనపై ప్రాయోగిక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం వృత్తి విద్య కోఆర్డినేటర్ సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగింది.



వంటలను రుచిచూస్తున్న జీసీడీవో చారులత తదితరులు

వరి కోతలు కోయవద్దు : ఏవో

రేపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు వరి కోతలు కోయరాదని వ్యవసాయ శాఖ ఏవో మహేష్‌బాబు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో పేటేరు, పిరాట్లంక, పోటుమెరక గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కోసిన ధాన్యాన్ని జాగ్రత్తపరుచుకోవాలని, కొనుగోలు కేంద్రాలకు వెళ్ళి అమ్ముకోవాలని సూచించారు. మండలంలో 70 టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉన్నాయని, ఎవరైన ధాన్యం ఆరబెట్టుకునేందుకు వర్షంలో తడవకుండా టార్పాలిన్ పట్టాలు తీసుకుని వెళ్ళాలని సూచించారు. రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. ఏమైనా ఇబ్బంది ఉంటే ఆయా ఏఈవోలను, ఏవోలను వ్యవసాయశాఖాధికారులను సంప్రదించాలని కోరారు.


ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలి

కర్లపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఏమైనా ఉంటే రైతులు జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 1967 లేక 7702806804ను సంప్రదించాలని వ్యవసాయశాఖాధికారి సుమంత్‌కుమార్, ఎంపీడీవో అద్దూరి శ్రీనివారావు సంయుక్తంగా తెలిపారు.

యోగా పోటీల్లో ప్రాడిజి విద్యార్థి ప్రతిభ

బాపట్లరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బాపట్ల ప్రాడిజి విద్యాలయ విద్యార్థి ఎన్.కౌశిక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం కైవసం చేసుకుని వెండి పతకం సాధించాడని ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్‌గో తెలిపారు. జిల్లాలోని జె.పంగులూరు మండలం, చందలూరు గ్రామంలో జరిగిన 69వ స్కూల్ గేమ్‌ఫెడరేషన్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కౌశిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన సభలో కౌశిక్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. రాబోయే రోజుల్లో కౌశిక్ జాతీయస్థాయిలో బంగారుపతకాలు సాధించాలని కరస్పాండెంట్ మాచాబత్తిని శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పార్థసారథి, ఉదయచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రత్నకుమార్, పద్మజ, బాబురావు, సునీల్, వరలక్ష్మి, మౌనిక, నీలిమలు కౌశిక్‌ను అభినందించారు.

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సురేష్



కేకేను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన పార్టీ నాయకుడు సురేష్

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్(కేకే)ను బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ బాధ్యతలో ఆయన మంచి సేవలు చేస్తారని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపినట్లు సురేష్ తెలిపారు.

క్లాస్-4 ఉద్యోగి మృతికి ఎస్పీ సంతాపం

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాన్ కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అన్నారు. బాపట్ల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో క్లాస్-4 వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ టి.జాన్ గుండెపోటుతో మరణించారు. ఎస్పీ ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. జాన్ భౌతికకాయాన్ని శనివారం గుంటూరులోని ఆయన గృహం వద్ద ఉంచగా ఎస్పీ ఆదేశాల మేరకు అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్ ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అత్యవసర ఆర్థిక సహాయంగా రూ.లక్ష నగదును జాన్ భార్య అంజమ్మకు అందజేశారు.

రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

అమృతలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న ప్రతి గింజా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పొన్నూరు నియోజకవర్గ పర్యటన నుంచి వెళుతున్న ఆయన శనివారం ఆకస్మికంగా మార్గమధ్యంలో మండల పరిధిలోని ఇంటూరులో వరి కోత కోసి ఉన్న పొలాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లా డుతూ ధాన్యం అమ్మకాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలపాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు క్యూలైన్‌లో నిలబడాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాలను కూడా పెంచడం జరిగిందని తెలిపారు. అనంతరం వీఏఏ వద్ద నుంచి ప్రస్తుతం గ్రామంలో ఎంత పంట కోత కోశారు. ఏ మేరకు దిగుబడులు వస్తున్నాయని అడిగారు.

శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని 7వవార్డు జమేదారుపేట అంజుమన్ దాహేరా (శ్మశాన వాటిక) కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెంటనే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీంజానీ, వైస్ ప్రెసిడెంట్ బాజీవలి, సెక్రటరి షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటిక కాంపౌండ్‌వాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు

మున్సిపల్ పార్క్ ఆధునికీకరణకు...

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని 31వవార్డు పెయింటర్స్ కాలనీ మున్సిపల్ పార్క్ ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శనివారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా సుందరీకరణ పనులను పూర్తి చేసి పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతుల ఆత్మ శాంతించాలని కొవ్వొత్తుల ర్యాలీ

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ ఎయిడ్స్‌తో అకాల మరణం చెందిన వారి ఆత్మ శాంతించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి నివాళులు అర్పించాల్సిన ఆవశ్యకత ఉందని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయమ్మ అన్నారు. డిసెంబరు ఒకటిన అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని శనివారం బాపట్లలో స్వచ్ఛంద సంస్థలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పీఎస్‌కే నర్సింగ్ కాలేజి విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మరణించిన కుటుంబాలకు మనం మనోధైర్యం కలిగించి వారికి అన్నివిధాలుగా అండగా ఉండాలని, వారికి ప్రభుత్వ పథకాలు చేరువయ్యేవిధంగా చూడాలని కోరారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు ఆశ్రయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో రత్నమనోహర్, డాక్టర్ లలిత రాజేశ్వరి, డాక్టర్ బాలసుధ, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ కె.విజయమ్మ తదితరులు

హెచ్ఐవీ బాధితులపై వివక్ష విడనాడాలి : డీఎంహెచ్‌వో

బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష విడనాడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయమ్మ అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిశా శనివారం బాపట్ల అంబేద్కర్ మార్గ్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.విజయమ్మ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులు క్రమం తప్పకుండా ఏఆర్‌టి మందులు వాడుకునే విధంగా చూడాలన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మించటానికి అందరం కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.లలిత రాజేశ్వరి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ మౌనిక, బాపట్ల జిల్లా దిశా క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ ఎం.చైతన్యకుమార్, పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

వేమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అలాగే సంబంధిత రోగుల పట్ల ఏ ఒక్కరూ వివక్షత చూపకూడదని వేమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ అన్నారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు డిసెంబరు 1వ తేదీ జాతీయ ఎయిడ్స్ డేని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆసుపత్రి భవనంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పర్వీన్ మాట్లాడుతూ కొన్ని వ్యాధుల విషయంలో ప్రజలు పూర్తి సమాచారాన్ని తీసుకుని అవగాహన పెంచుకోవడంతో పాటు సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, డాక్టర్ అనీల్, డాక్టర్ సునీత, హెడ్ నర్స్ రత్నకుమారి, సిరి సాధికార మండలి సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీదత్తాత్రేయస్వామి జయంతి మహోత్సవాలు

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేద, శాస్త్ర, స్మార్త గురుకుల పాఠశాలగా ప్రసిద్ధిగాంచిన బాపట్ల శ్రీ శంకర విద్యాలయ ఆధ్వర్యంలో శ్రీదత్తాత్రేయ స్వామి జయంతి మహోత్సవాలు, శ్రీ శంకర విద్యాలయ 109వ వార్షిక ఆవిర్భావ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యాలయంలో శ్రీ దత్తాత్రేయ జయంతి మహోత్సవాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 30వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు ఐదు రోజులపాటు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా జరగనున్నాయని తెలిపారు.

ధూళిపాళ్ళ గృహానికి మంత్రి అచ్చెన్నాయుడు

పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గృహానికి శనివారం రాష్ట్రమంత్రి కింజారపు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చిన్న కుమార్తె ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి నిశ్చితార్థ వేడుక ఆదివారం జరగనున్న నేపథ్యంలో మంత్రి శనివారం విచ్చేసి వైదీప్తికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ్ళ కుటుంబ సభ్యులు కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైదీప్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి

కూటమి హయాంలో నెంబర్ వన్‌గా ఏపీ

● సినీ నటుడు నరేష్ ● పేటలో విజయనిర్మల విగ్రహం ఏర్పాటు



శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, సినీ నటుడు నరేష్

నరసరావుపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాబోయే రోజుల్లో నెంబర్ వన్ అవుతుందని సినీ నటుడు నరేష్ అన్నారు. పట్టణంలో నరేష్ తల్లి, ప్రముఖ నటి, దర్శకురాలు విజయనిర్మల విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం ఎంపిక చేయడానికి వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్న కంపెనీలన్నీ ఏర్పాటైతే యువత ఉద్యోగాల కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. దేశంలోనే చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడన్నారు. తన తల్లి విజయనిర్మల నరసరావుపేటలో పుట్టారని, ఆమె మేనమామ పసుపులేటి వసంతరావు థియేటర్ ఇంజనీర్‌గా పనిచేశారని తెలిపారు. చిన్నప్పుడు తన తల్లితో తాను నర్సరావుపేటకు వచ్చి జమీందార్ కోటలో ఆడుకునే వాడినని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ఇక్కడ తిరిగినప్పుడు ఉద్వేగానికి లోనయ్యానని చెప్పారు. నరసరావుపేటతో అనుబంధం ఉన్నందునే ఇక్కడ తన తల్లి విజయనిర్మల విగ్రహం ప్రతిష్ఠాపించాలని సంకల్పించానని చెప్పారు. స్థలం పరిశీలన నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో పట్టణంలో తిరిగానన్నారు. ఈ విషయంలో ఆయన సహకారం మరువలేనన్నారు. అలాగే తాను న్యూ మోంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్‌కు నేషనల్ ప్రెసిండెంట్‌నని, త్వరలో పట్టణంలో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా కుంగ్‌ఫూ అకాడమి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేవలం కుంగ్‌ఫూ పరిమితం కాకుండా యోగా, కూచిపూడి, భరతనాట్యం వంటివి కూడా నేర్పించేలా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానన్నారు. ప్రస్తుతం తాను ఏ పార్టీలో లేనని తెలిపారు. సినిమాల్లో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నానన్నారు. ప్రస్తుతం 8 కొత్త చిత్రాలలో నటిస్తున్నట్లు చెప్పారు. తన చిత్రం భళారే చిత్రం, జంబలకిడిపంబను రీమేక్ చేయాలని ఉందన్నారు. నాలుగుస్తంభాలాట సినిమాను రీ రిలీజ్ చేస్తానన్నారు.

యువత మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి పెట్టాలి

యువత ఆత్మరక్షణ కోసం కుంగ్‌ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి పెట్టాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం స్థానిక హెచ్6 రెసిడెన్సీలో జరిగిన న్యూ మోంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ సర్టిఫికెట్ ప్రదాన కార్యక్రమానిక ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్‌లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను, సిని నటుడు నరేష్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుంగ్‌ఫూను యువతకు చేరువ చేయడంలో న్యూ మోంక్స్ అసోసియేషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అనంతరం నరేష్‌తో కలిసి శిక్షణ పొందిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, షేక్‌జిలానిమాలిక్, కామినేని సాయిబాబు, గట్టినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్, అనకాపల్లి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో గుంటూరు మీదగా సికింద్రాబాద్, అనకాపల్లి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07041 సికింద్రాబాద్ - అనకాపల్లి ప్రత్యేక రైలు డిసెంబరు 7, 14, 21, 28(ఆదివారం) తేదీలలో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు డిసెంబరు 8, 15, 22, 29(సోమవారం) తేదీలలో గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా గమ్యస్థానానికి చేరుకొంటుంది. 02863 సంత్రగచి - యల్హాంక ప్రత్యేక రైలు డిసెంబరు 4, 11, 18, 25(గురువారం) తేదీల్లో గుంటూరు, నరసరావుపేట మీదగా ప్రయాణిస్తుంది. 02864 యల్హాంక - సంత్రగచి స్పెషల్ డిసెంబరు 6, 13, 20, 27(శనివారం) తేదీల్లో నరసరావుపేట, గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది.

డాక్టర్ నరేంద్రరెడ్డికి టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు

గుంటూరు మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రఖ్యాత టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ చేతుల మీదుగా డాక్టర్ నరేంద్రరెడ్డి అవార్డును స్వీకరించారు. ప్రముఖ మీడియా సంస్థ టైమ్స్ యాజమాన్యం ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డు ప్రదానం చేస్తోంది. వైద్య రంగానికి సంబంధించి తుంటి, మోకీలు మార్పిడి ఆపరేషన్లలో రోబోటిక్ టెక్నాలజీ వినియగం ద్వారా విశేష ప్రతిభ కనబర్చి.. లీడర్ ఇన్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీగా డాక్టర్ నరేంద్రరెడ్డి నిలిచారని టైమ్స్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రోబోటిక్ ద్వారా అత్యధిక శస్త్రచికిత్సలు నిర్వహించడంతో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రఖ్యాత టైమ్స్ అవార్డును అందుకున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డికి పలువురు వైద్యులు, పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.



అనుపమ్ ఖేర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

వీవీఐపీల ప్రయాణ మార్గంలో ప్రత్యేక భద్రతా తనిఖీలు



సీడ్ యాక్సిస్ రోడ్డులో తనిఖీలు



తనిఖీల్లో భద్రతా విభాగం, ఎస్ఎస్‌జి సిబ్బంది

తాడేపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వీవీఐపీలు, వీఐపీలు తరచూ ప్రయాణించే ముఖ్య మార్గాల్లో భద్రతా ప్రమాణాలు మరింత బలోపేతం చేసేందుకు జిల్లా భద్రతా విభాగం (డీఎస్‌డబ్ల్యూ), స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) సంయుక్తంగా శనివారం విస్తృతం తనిఖీలు చేపట్టాయి. ప్రకాశం బ్యారేజి లోటస్ పాయింట్, కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్డు, సెక్రటరియట్, లోటస్ పాయింట్ నుంచి టీడీపీ కేంద్ర కార్యాలయం వరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ మార్గాల్లోని క్రిటికల్ పాయింట్లు, ట్రాఫిక్ జంక్షన్లు, రోడ్డు పక్క వ్యాపార సముదాయాలు, డివైడర్లు, చెట్ల పొదలు, కల్వర్టులు, వంతెనలు, తూములు వంటి ప్రతి విభాగాన్ని ప్రత్యేక పరికరాలు, ఆధునిక భద్రతా యంత్రాలు, శిక్షణ పొందిన పోలీసు జాగిలాల సాయంతో ముమ్మరంగా జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ.. ఎటువంటి భద్రతా లోపాలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్టం చేయడానికి.. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ భద్రతా సిబ్బంది నిర్వహించే భద్రత తనిఖీల ఖచ్చితత్వాన్ని సమీక్షించడానికి భద్రతా ప్రమాణాల మెరుగుదల అవసరమైన ప్రాంతాలను గుర్తించడానికి ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌జీ డీఎస్పీ రామకృష్ణ, జిల్లా భద్రతా విభాగ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఎస్‌జీ ఆర్ఐలు నరేష్, శంకర్, డీఎస్‌డబ్ల్యూ ఎస్ఎస్‌జీ సిబ్బంది పాల్గొన్నారు.

దిత్వా వస్తోంది.. పంటలు జాగ్రత్తా!

పంటల రక్షణకు డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచనలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుపాను ఉత్తర - వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. తీవ్ర వాయుగుండంగా తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని అంటోంది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతంలో అక్కడక్కడ భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాల కురుస్తాయన్న నేపథ్యంలో సాగులో ఉన్న పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ కీలక సూచనలు చేశారు.



వరి పంట

వరి: దక్షిణ మండలంలో పిలకల దశలో, కృష్ణా మండలంలో కోత దశలో, కుప్పలు, పనల మీద వరి పంట ఉంది. ఆలస్యంగా వేసిన పంట పూత నుంచి పాలు పోసుకునే దశలో ఉంది. ఈదురు గాలులకు పంట నష్టం తీవ్రతను తగ్గించేందుకు.. ఈ సూచనలు పాటించాలి.



డాక్టర్ పీవీ సత్యనారాయణ

● నారుమడిలోని 2-3 రోజుల వయసులో ఉన్న పంట 3 రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే.. మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. విత్తిన ఏడు నుంచి 30 రోజుల మధ్యంలో నారు ఐదు రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బ తినే అవకాశం ఉంది. నారు మడిలో ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసి.. 5 సెంట్ల నారు మడికి కేజీ యూరియా, కేజీ పోటాష్ వేసుకోవాలి. గ్రాము కార్బెన్డిజిమ్ లేదా రెండు గ్రాముల కార్బెన్డిజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

● పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజులు నీట మునిగిన బతికే అవకాశం ఉంది. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 20 కేజీల యూరియా, 20 కేజీల పోటాష్ కలిపి అదనంగా వేసుకోవాలి.

● వరి పంట పూత నుంచి పాలుపోసుకునే దశలో ఉంటే.. అంతర్గత కాలువల ద్వారా నీటిని తొలగించాలి. పంట పడిపోయిన పొలంలో గింజలు రంగు మారడం, మాగుడు, మానిపండు తెగుళ్ల నివారణకు ఎకరాకు 200మి.లీ. ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.

● గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో ఉంటే.. నిల్వ నీటిని బయటకు పంపిన తర్వాత.. కోత కంకిలో మొలకలు కనపడితే 50 గ్రాములు కల్లు ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకెత్తడాన్ని, రంగు మారడాన్ని తగ్గిస్తుంది.

● ఇప్పటికే కోతకోసి కుప్పల మీద ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పుకొని రక్షించుకోవాలి. గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా క్వింటాలు ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీ పొడి ఊక కలపాలి.

మినుము, పెసర: మినుము, పెసర పంటలు మొలక దశ నుంచి శాఖీయ, పూత నుంచి కాయ కోత దశలో ఉంది. మొలక దశ నుంచి శాఖీయ దశ అపరాలు పంటలు ముంపునకు గురైతే.. పొలాలలో మురుగు వీలైనంత త్వరగా తొలగించాలి. ఇనుపధాతు లోపం నివారణకు అన్న బేది 50 గ్రాములు, నిమ్మ ఉప్పు 5 గ్రాము, యూరియ 100 నుంచి 150 గ్రాముల లెక్కన 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. వారం తరువాత ఒక శాతం 19: 19: 19 లేదా పొటాసియం నైట్రేట్‌ను కలిపి పిచికారి చయాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా లీటరు నీటికి 2.0 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా ఒక మి.లీ ప్రాపికొనజోల్‌ను కలిపి పిచికారి చేయాలి.

● పూత నుంచి కాయ దశలో ఉన్న పంటలో వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సాకొనజోల్ లేదా ఒక మి.లీ ప్రాపికొనజోల్‌ను కలిపి పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు ఆశించకుండా.. క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 2.5 మి.లీ లేక నోవాల్యురాన్ 10 ఈసీ 1.0 మి.లీలో ఏదో ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

శనగ: శనగ పంట ప్రస్తుతం మొలకెత్తే దశ నుంచి శాఖీయ దశలో ఉంది. మొదలుకుళ్లు, తడి వేరు కుళ్ళు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నివారణకు తెగులు సోకిన మొక్కల వేరు భాగం తడిచేలాగా లీటరు నీటికి 3 గ్రాములు మాంకోజెబ్ లేదా కార్బెండజిం 12శాతం, మాంకోజెబ్ 63 శాతం చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు కార్బెండజిం గ్రాము లీటర్ నీటిలో కలుపుకొని వేరు భాగం తడిచేలాగా పిచికారి చేయాలి. నీరు నిలిచిన పొలాల్లో మొక్కల ఆకులు పసుపు రంగలోకి మారితే.. 10గ్రాముల యూరియా లేదా 10 గ్రామాలు 19-19-19 చొప్పున లీటరు నీటికి కలుపుకుని పైపాటుగా పిచికారి చేయాలి. దీనితో పాటుగా కార్బెండజిం 12శాతం, మాంకోజెబ్ 63శాతం చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకుంటే తెగుళ్ల వ్యాప్తిని కూడా అరికట్టవచ్చు.

పత్తి: పగిలిన పత్తిని వెంటనే తీసి జాగ్రత్త చేసుకోవాలి. సాధ్యమైనంత త్వరగా ప్రత్తి తీతలు పూర్తి చేయాలి. మురుగు నీటిని వీలైనంత త్వరగా పోయే మార్గం కల్పించాలి. పంటలో చాళ్లు ఏర్పాటు చేసి మొక్కలలో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. వర్షాలు తగ్గిన తర్వాత పొడి వాతావరణంలో పత్తి తాయాలి. తీసిన పత్తిలో తేమ ఎక్కువగా ఉంటే.. నీడలో ఆరబెట్టడం మంచిది. 5 గ్రాముల బోరాక్స్ లీటరు నీటికి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కాయ కుళ్లు తగ్గించడానికి 3 గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ లీటరు నీటికి కలిపి మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా మూడు మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ప్రొపికోనజోల్ గాని క్రేసోక్సిమ్ మిథైల్ గాని మీ.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5% నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి.

జొన్న, మొక్కజొన్న: జొన్న, మొక్కజొన్న కాండాన్ని బలపరచేందుకు ఎర్తింగ్ అప్ చేయాలి. సాధ్యమైనపుడు చిన్న కాలంలో పండే జొన్నను ముందుగానే కోయాలి. కోత సమీపిస్తున్న మొక్కజొన్నలో గింజల్లో 20-25% తేమ ఉన్నపుడు ముందుగా కోయాలి. పడి పోయే ప్రమాదం ఉన్న పొలాల్లో మొక్కలను కట్టివేయడం/ టై చేయడం చేయాలి. తుపాను ముందు మూడు నాలుగు రోజులు నీటిపారుదల ఇవ్వకూడదు. డ్రెయినేజీ అడ్డంకులు రాకుండా పొలంలోని అవశేషాలను తొలగించాలి. వర్షాలు పడే ముందు ప్రొటెక్టివ్ ఫంగిసైడ్ (ప్రోపికోనజోల్/ కార్బెండాజిమ్) పిచికారీ చేయాలి. ప్రస్తుతం నైట్రోజన్ టాప్ డ్రెస్సింగ్ ఇవ్వకూడదు. వర్షాల తర్వాత కండె కుళ్లు నివారణ కోసం ఫంగిసైడ్ పిచికారీ చేయాలి. బలమైన గాలులు వీయకముందే కోతకు సిద్ధమైన మొక్కజొన్నను వెంటనే కోయాలి. కండెలను ఎత్తైన ప్రదేశాల్లో ఆరబెట్టాలి. జొన్న పడిపోవడం తగ్గించేందుకు కంకులను కట్టివేయాలి. మొక్కజొన్న, జొన్న శాఖీయ దశలో ఉంటే.. తుపాను ముందుగా ఎలాంటి ఎరువులు వేయకూడదు. వర్షం అంచనా స్పష్టంగా వచ్చే వరకు కొత్తగా మొక్కజొన్న విత్తకూడదు. వర్షం తర్వాత 3-5 రోజుల్లో గ్యాప్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి.

విభిన్న క్రీడల్లో ప్రతిభావంతులు

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఉత్సాహంగా క్రీడా పోటీలు..



పరుగు పందెం ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు



షాట్‌పుట్‌లో.. బెస్ట్ అవుట్‌పుట్



త్రిచక్ర వాహనాలపై దూసుకెళ్తూ..

గుంటూరు (క్రీడలు) నవంబరు 29(ఆంధ్రజ్యోతి) దివ్యాం గులు విభిన్న అంశాలలో ప్రతిభ కలిగి ఉంటారని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్ఠలు సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి ఆకాంక్షించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో దివ్యాంగులకు శనివారం క్రీడా పోటీలను నిర్వహించింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ దివ్యాంగుల్లో ప్రతిభకు కొదవలేదని.. సృజనాత్మకతను మరింతగా వెలికి తీసి పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను దివ్యాంగులకు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యా, ఉపాధి అవకాశాల్లోను, క్రీడారంగంలోను రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి, ఇన్‌చార్జి దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకుల డి.దుర్గా బాయి మాట్లాడుతూ డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలను వివిధ అంశాల్లో నిర్వహించినట్లు తెలిపారు. క్రీడా పోటీలు, దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొనే దివ్యాంగ ఉద్యోగులకు ఆన్ డ్యూటీగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను దివ్యాంగులు అందిపుచ్చుకునే విధంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ టి.విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వహక ఇంజనీర్ నజీమా, విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు జెండా ఊపి లాంఛనంగా క్రీడా పోటీలను ప్రారంభింపజేశారు.

పారిశ్రామికవేత్తలను
ప్రోత్సహించడమే ఏపీఐడీసీ ధ్యేయం

● చైర్మన్ డేగల ప్రభాకర్



బోర్డు సమావేశంలో పాల్గొన్న చైర్మన్ డేగల ప్రభాకర్, డైరెక్టర్లు

తాడేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ఏపీఐడీసీ ధ్యేయమని బోర్డు చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. శనివారం తాడేపల్లిలోని ఏపీఐడీసీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కార్పొరేషన్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి 792 కంపెనీలకు సుమారు రూ.344 కోట్ల లోన్లు అందించడం జరిగిందన్నారు. 2006 నుంచి కొన్ని అనివార్య కారణాల వల్ల కార్పొరేషన్ యాక్టివిటీ ఆగిపోవడం జరిగిందని, ముఖ్యంగా కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఐడీసీని పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతగానో ప్రోత్సహించారన్నారు. వారి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పలు అంతర్జాతీయ జాతీయ సంస్థలతో రూ.16లక్షల కోట్లతో కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక కేంద్రంగా మారిందన్నారు. విశాఖ వేదికగా కుదిరిన పారిశ్రామిక ఒప్పందాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సువర్ణమయంగా మారుస్తాయన్నారు. ఏపీ ఐడీసీని గాడిలో పెట్టేందుకు సంవత్సరకాలం పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అకౌంట్ల పనులను పూర్తిస్థాయిలోకి తీసుకువచ్చామన్నారు. రెండు నెలల్లో పూర్తి స్థాయిలో ప్రభుత్వ నిర్ణయం మేరకు అభివృద్ధిలో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రుణాలు తీసుకున్న వివిధ కంపెనీలకు నోటీసులు ఇచ్చి రికవరీలు కూడా చేస్తున్నట్టు పేర్కొన్నారు. పీ 4 విధానంతో పరిశ్రమలకు ఇండస్ట్రియల్ పార్క్‌లకు పెద్ద పీట వేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయానికి అనుగుణంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండి రఘునాథ్, డైరెక్టర్లు మల్హోత్రా, బాలభారతి, రాజారావు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల మృతి

నరసరావుపేట లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. నరసరావుపేట- మునుమాక రైల్వేస్టేషన్ల మధ్య శనివారం రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు నరసరావుపేట రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి మెడపై మూడు నక్షత్రాలు పచ్చబొట్లు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసినవారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పావులూరి సుబ్బారావు పాఠశాల ఎదురుగా సుమారు 30 నుంచి 30 సంవత్సరాలకు వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆచూకీ తెలిసినవారు మొదటి పట్టణ పోలీసులను సంప్రదించాల్సిందిగా ఎస్ఐ అరుణ కోరారు.

అంబటి డబ్బులు వసూలు చేస్తే..
మా మీద నిందలా?

● మాజీ మంత్రిపై వైసీసీ మున్సిపల్ చైర్‌పర్సన్ విమర్శ

● డస్ట్‌బిన్ నిధుల గోల్‌మాల్‌పై కౌన్సిల్‌లో సమాధానం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ

సత్తెనపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలక సంఘంలో డస్ట్ బిన్‌ల కొనుగోలుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి అంబటి రాంబాబు డబ్బులు వసూలు చేస్తే.. తమ మీద నిందలు వేస్తే ఎలా? అంటూ వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ శనివారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘంలో డస్ట్ బిన్‌ల కొనుగోలుకు గత ప్రభుత్వంలో రూ.54లక్షలు నిధులు వస్తే దుర్వినియోగం చేసి.. పట్టణంలో రెండు కోట్ల రూపాయలకు పైగా విరాళాలు వసూలు చేశారని మునిసిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ ఆరోపించారు. దీంతో 'మునిసిపాలిటీ పేరు చెప్పి అంబటి రాంబాబు డబ్బులు వసూలు చేస్తే.. మా మీద నిందలు వేస్తే ఎలా? అంబటి రాంబాబును అగగండి.' అంటూ అంటూ చైర్‌పరన్ లక్ష్మీతులసీ తీవ్రంగా స్పందించారు. ఆమె సమాధానం విన్న వైసీపీ కౌన్సిలర్లు ఖంగుతిన్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆరోపణలు చేయడం అటు కౌన్సిల్‌లో, ఇటు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

రైతుల సొమ్ము స్వాహాపై చర్యలు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జీడీసీసీ బ్యాంకు మంగళగిరి బ్రాంచ్ పరిధిలోని మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఏకంగా మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న మంగళగిరి నియోజకవర్గంలో పరిధిలోని పీఏసీఎస్‌లలో అక్రమాలు జరగటం సహకార శాఖ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌లలో రైతుల సొమ్ము స్వాహా పేరుతో ప్రచురితమైన కథనం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దాంతో వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం ప్రాథమిక విచారణ జరిపి అక్రమాలు నిజమేనని తేల్చి చెప్పారు. మంగళగిరి, కురగల్లులో రైతులు దాచుకున్న సొమ్మును ఇంటి దొంగలే కాజేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్రమాలు వెలుగుచూడటంతో గగ్గోలు పెట్టిన రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా కమిషనర్ అనుమతితో కలెక్టర్ విచారణకు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా సహకార అధికారి వీరాచారి తెలిపారు. మంగళగిరి, కురగల్లు సంఘాలకు సీఈవోగా వ్యవహరిస్తోన్న రాయల రమేష్‌బాబుపై ఇప్పటికే మంగళగిరి రూరల్, టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌లలో ఇంటి దొంగలే రైతుల సొమ్ము స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా అక్రమాలపై నెల రోజుల్లో విచారణ పూర్తి చేసి, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పేద విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రజాప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో గత ప్రభుత్వం కంటే అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం లక్ష్యమని తెలిపారు. తొలుత మరమ్మతులు చేస్తున్న కందుకూరు రోడ్డులోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని, ఇటీవల పూర్తిచేసిన చేపల మార్కెట్ ఆధునికీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

డాక్టర్ కృష్ణచైతన్యకు అవార్డు ప్రదానం



ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న డాక్టర్ కృష్ణచైతన్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన ఆరో ఎడిషన్ టైమ్ ఎక్సలెన్స్ అవార్డు-25ను ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ హాస్పటల్ డాక్టర్ బీఎంవీ.కృష్ణచైతన్య అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ అవార్డును అందుకున్నారు. ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ ఎన్‌వీ.రమణ, డైరెక్టర్ అనుపమకేర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణచైతన్యను పలువురు డాక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆది, సోమవారాల్లో ఒంగోలులో జరిగే పలు పలు కార్యక్రమాకు హాజరుకానున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి వేడుకల పనులను మాగుంట రాఘవరెడ్డితో కలిసి పరిశీలిస్తారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం ఉదయం 9గంటలకు మాగుంట కార్యాలయంలో, అనంతరం సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

ఎలక్ట్రానిక్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హోమ్ అప్లయన్సెస్ అండ్ బేసిక్ ఎలక్ట్రానిక్స్ టెక్నీషీన్‌లుగా ఉచిత శిక్షణ అందింస్తున్నట్లు ప్రేరణ ఎన్జీవో సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలులోనే మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజనం, శిక్షణ అందిస్తామన్నారు. ఏసీ, కూలర్, వాషింగ్ మెషిన్, టీవీ, ఫ్రిడ్జ్, ఇతర గృహోపకరణాల మరమ్మతులలో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల ఉమ్మడి ప్రకాశం జిల్లా యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది. 18-35 సంవత్సరాల వయస్సు, కనీస విద్యార్హత 10వ తరగతి వారు అర్హులని, డిసెంబరు 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9908824390 ద్వారా సంప్రదించాలని ఆ సంస్థ కోరింది.

వృద్ధురాలి నేత్రాలు దానం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన కోడూరి పెద్దమ్మ (98) మరణించడంతో ఆమె కుటుంబసభ్యులు శనివారం ఆమె నేత్రాలను ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుమార్తె పిన్నక లక్ష్మీసీతాంబ మాట్లాడుతూ బాపట్ల జిల్లా నరసాయాలెంకు చెందిన తన తల్లి పెద్దమ్మ కోరిక మేరకు నేత్రాలు దానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఎస్‌వీ.రంగారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యుడుదివంగత మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లను శనివారం సాయంత్రం మాగుంట ప్రతినిధులు పరిశీలించారు. సోమవారం స్థానిక పీవీఆర్ గ్రౌండ్‌లో సుబ్బరామరెడ్డి వర్ధంతి నేపథ్యంలో అక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి నిర్వహకులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్.లక్ష్మీనారాయణరెడ్డి, బెజవాడ సురేష్‌రెడ్డి, అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, ఆత్మకూరి బ్రహ్మయ్య, కుప్పా రంగసాయి, పాలపర్తి శీనారెడ్డి, కృష్ణారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

మద్దిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేసి అధికారంలోకి తీసుకునిరావడమే లక్ష్యమని మాజీ ఎంపీ జేడీ.శీలం అన్నారు. శనివారం మద్దిపాడులో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ షారాద్ అహర్, పీసీసీ కార్యదర్శి గంటా అంజిబాబు, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్ పాల్గొని మట్లాడారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలకు మంచి జరగాలంటే ఇందిరమ్మరాజ్యం రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొణిజేటి గురుబాబు, నట్టే సుబ్బారావు, పులిపాటి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్‌స్టార్‌ను ఏర్పాటు చేసిన క్రిస్టియన్లు

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్ర జ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావన్ గార్డెన్స్ కాలనీ రహదారిలో గల బేతస్థ చర్చి దగ్గర శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చైతన్య ప్రభు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొత్తపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్ కోరారు. శనివారం మోటుమాల కస్తూర్బా బాలికల పాఠశాల, కొత్తపట్నంలో జడ్పీ హైస్కూలును ఆయన సందర్శించారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సంపూర్ణ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కొత్తపట్నంలో స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీవో హేమలత, ఎంఈవో పద్మావతి, కోఆర్డినేటర్ జాలరత్నం, ఏఎంవో నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే దామచర్ల
● దివ్యాంగుల క్రీడా పోటీల ప్రారంభం



దివ్యాంగుల క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలు నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగేందుకు క్రీడలు ఉత్తమ మార్గమన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వైకల్యాన్ని అధిగిమించి ముందుకు సాగాలన్నారు. అలాగే వివిధ రుణాల మంజూరు, అలాగే పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పోటీలలో జిల్లావ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సువార్త, డీఈవో కిరణ్‌కుమార్, డీఎస్‌డీవో రాజేశ్వరి, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటారు.

అల్పాహారం అందజేత

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూలులో జరిగిన క్రీడా పోటీల సందర్భంగా సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు సర్దార్‌బాషా, షమనాజ్, మనవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రూ.50లక్షలతో మార్కెట్ కమిటీ భవన నిర్మాణాలు

● మద్దిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజేశ్వరి

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు మార్కెట్‌కమిటీ యార్డులో రూ.50లక్షలతో నూతన భవనాలు, యార్డు మరమ్మతులు చేపడుతున్నట్లు కమిటీ చైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరి తెలిపారు. శనివారం సంతనూతలపాడులోని మద్దిపాడు ఏఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గసభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉప్పుగుండూరు యార్డు అభివృద్ధి కోసం తీర్మానించిన ప్రతిపాదనలను రాష్ట్ర మార్కెట్ కమిటీ కమిషనర్‌కు పంపనున్నట్లు చెప్పారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో పశువుల సంత పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ కమిటీకి రూ.4.52కోట్లు లక్ష్యం కాగా నవంబరు నెల వరకు రూ.1.64కోట్లు సెస్సురూపంలో వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులోని మార్కెట్ కమిటీ స్థలాన్ని కోల్డ్‌స్టోరేజ్‌కు లీజ్‌కు ఇవ్వడానికి తీర్మానించినట్లు తెలిపారు. సభ్యుల ఫిర్యాదు మేరకు కమిటీ సమావేశానికి గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఏఎంసీ ఆదాయం పెంపునకు కృషిచేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి దానమ్మ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ షేక్ ఖాజావలి, మన్నం ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఎమ్మెల్యే దామచర్ల



రైతులకు దాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఇందుకోసం ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం, పశువుల దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మెగా పశువైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన మహిళలకు పాడిపశువులను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో కొనుగోలు చేసి ఇస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసిందని, ఇది వారికి కొంత ఉపశమనం కలిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశువులకు గర్భకోశవ్యాధులు రాకుండా వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ఉచితంగా మందులు కూడా అందజేస్తామని చెప్పారు. మేలు జాతి దూడలతో పశుసంపదను వృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే 100 మంది రైతులకు పశువుల దాణాను 50శాతం సబ్సిడీతో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఎన్.జగత్‌శ్రీనివాసులు, బి.మురళికృష్ణ, ఎన్.జయచంద్ర, కాట్రగడ్డ అనిల్, భరత్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టీడీపీ నాయకులు కొటారి నాగేశ్వరరావు, బండారు మదన్, కాట్రగడ్డ రఘు, నడిపినేని భాస్కర్, వడ్లమూడి మునీంద్ర, కాట్రగడ్డ వెంకట్రామయ్య, నీటి సంఘం అధ్యక్షుడు బత్తినేని కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త కనిపిస్తే పంచాయతీ అధికారిదే బాధ్యత

● డీపీవో వెంకటేశ్వరరావు



ఇలపావులూరులో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

చీమకుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రోడ్లపై చెత్త కనిపిస్తే పంచాయతీ డెవలెప్‌మెంట్ అధికారిదే బాధ్యతని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇలపావులూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వామిత్వ గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన డీపీవో మాట్లాడుతూ సర్వేపై వచ్చిన అభ్యంతరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తన పర్యటనల్లో ఇలపావులూరు, శివరాంపురం, వెల్లంపల్లి గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోవటం, వీధిదీపాలు పగలు సైతం వెలగటం లాంటి లోపాలను గుర్తించినట్లు చెప్పారు. వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్రరావు, శ్రీధర్‌రావు, సర్పంచ్ పులి రమణమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం వెల్లంపల్లిలో ఆయన పర్యటించి ఆయన అపరిశుభ్రంగా ఉన్న పేడదిబ్బలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి మాధవిని ఆదేశించారు. సర్పంచ్, కార్యదర్శులు సమన్వయం చేసుకుని గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. నూరు శాతం పన్నులు వసూలు చేయాలని, ప్రతి శుక్రవారం పరిశుభ్రతకు కేటాయించాలని, దోమలు అభివృద్ధి చెంది అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు, సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

● ఆర్టీఏ అధికారి భాస్కర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ, వేగ పరిమితులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆర్టీఏ అధికారులు జి.భాస్కర్, కె.జయప్రకాష్ సూచించారు. శనివారం ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ నియంత్రణ- భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మద్యం సేవించి వాహనాన్ని నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే అనార్థాలు, రాంగ్‌వే డ్రైవింగ్, అధిక వేగం, ఓవర్ టేకింగ్, లైసెన్స్ తీసుకునే విధానాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు వివరించారు. విద్యార్థులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నప్పును తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే.మూర్తి, ఏవో ఎం.రమణబాబు, ట్రాన్స్‌పోర్టు కళాశాల ఇన్‌చార్జిలు ఏకాంబరం, రవీంద్ర, ఎర్రం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఉప్పుగుండూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జి.బసవపున్నయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకొన్న 8 గంటల పని విధానాన్ని హరించే విధంగా 12 గంటలు పనిచేయాలని యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను కేంద్రప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమైన చర్యన్నారు. అనంతరం జీవోలను దహనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నలతోటి రామారావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికీ సమాన హక్కులు

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, భారత ప్రభుత్వం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందని రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం యరజర్ల ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికీ సమానమని, ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, దేవదాయశాఖ ఈవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: బండ్లమూడి ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రజలందరూ చట్టం ముందు సమానులే అని చెప్పారు. సమావేశంలో సీఐ దాసరి ప్రసాద్, ఎంపీడీవో రాఘవేంద్ర, ఏవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



ఆటల పోటీలకు హాజరైన ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మండల స్థాయి ఆటల పోటీలు శనివారం ఒంగోలులో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను డీఈవో కిరణ్‌కుమార్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.అనీల్‌కుమార్, ఎంఈవో టి.కిషోర్‌బాబులు ప్రారంభించారు. శనివారం ఉదయం పురుషుల విభాగంలో క్రికెట్ రెండు టీంలు, సాయంత్రం రెండు టీంలు పోటీలో పాల్గొన్నారు. మహిళా విభాగంలో త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఒంగోలు మండలంలోని 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడూ కరెంటు బిల్లులు చెల్లించవచ్చు : ఎస్ఈ

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ఆదివారం సెలవు అయినా కరెంటు బిల్లులు చెల్లించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు జిల్లాలోని అన్ని కౌంటర్లు తెరిచి ఉంటాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల, ఊళ్ళపాలెం, కనపర్తి బీచ్‌లకు ప్రజలు వెళ్లవద్దన్నారు. సముద్రంలో అలలు తీవ్రత ఉందని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్ప తీర ప్రాంత ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే 112 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం మండవవారిపాలెంలో ఆదివారం ఉదయం నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్రం, సచివాలయ భవనం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారికి స్వర్ణపద్మపీఠం సమర్పణ



స్వర్ణ పద్మపీఠం సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామికి భక్తులు స్వర్ణ పద్మపీఠాన్ని సమర్పించారు. ఒంగోలుకు చెందిన భాస్కరుని వెంకట అనిల్‌కుమార్, మొవ్వ శ్రీనివాస్, సింగరాయకొండకు చెందిన బత్తుల సుభాష్ చంద్ర, తిప్పారెడ్డి సంజీవరెడ్డి, తిరుమలరెడ్డిలు ఈ స్వర్ణ పద్మపీఠాన్ని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అందజేశారు. అనంతరం వారికి వేదపండితులు వేద ఆశీర్వదించారు. స్వర్ణ పద్మపీఠం సమర్పించిన దాతలకు ఆలయ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, ధర్మకర్తలు సుశీలాదేవి, సీవీ.రామకృష్ణారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కళామిత్రమండలి వార్షికోత్సవం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కళామిత్ర మండలి తెలుగు లోగిలి వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే ఈ వేడుకలలో సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణకు నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం జీవనసాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్మారక ఉపన్యాసం జేడీ లక్ష్మీనారాయణ చేస్తారన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తదితర రాజకీయ ప్రముఖులు, సాహిత్య ప్రముఖులు పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి భాగవత సప్తాహం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాగంటి శ్రీరామమూర్తి, పింగళి పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరం వీఐపీ రోడ్‌లోని పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పద్యసారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యులు ప్రవచనకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కనుక సాహిత్య, ఆధ్యాత్మికవేత్తలు, అభిమానులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

అమరావతి సమస్యలు పరిష్కరిస్తాం

(5వ పేజీ తరువాయి)

విచారణకు వస్తున్నాయన్నారు. అవి కూడా పరిష్కారమైతే డిసెంబరు 10న మిగిలిపోయిన భూమికి నోటిఫికేషన్ ఇచ్చి ఎల్‌పీఎస్ అమలు చేస్తామన్నారు. అప్పట్లో రైతులు ఇవ్వని భూముల్లో కూడా సీఆర్‌డీఏ ఎల్‌పీఎస్ లేఅవుట్లను రూపొందించి ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. వాళ్లంతా మూడు, నాలుగు నెలలు ఓపిక పడితే సమస్యని సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లేదంటే సమీప గ్రామాల్లోని లేఅవుట్లలో లాటరీ వేసి ప్లాట్లు ఇస్తామన్నారు. కొంతమంది పెద్ద రైతులకు 10 వేల గజాల నుంచి 15 వేల గజాల ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని, వారు కూడా కొంత ఓపిక పట్టాలన్నారు. లేదంటే వారికి ఇవ్వాల్సిన ప్లాటుని ఒకే ముక్కగా కాకుండా విభజించి ఇస్తామని చెప్పారు. అమరావతి రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో జరీబు, గ్రామ కంఠాల సమస్యలపై కలెక్టర్, తెనాలి సబ్ కలెక్టర్, తహసీల్దార్, వీఆర్‌వోలతో విచారణ జరిపించి నెలలో నివేదిక తెప్పించుకుని పరిష్కరిస్తామన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి గ్రామ కంఠాల మినహాయింపు పొంది ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు.

నెలలో హెల్త్‌కార్డులు, పింఛన్లు

అమరావతి రైతులు 38 వేల మందికి గతంలోనే హెల్త్‌కార్డులు ఇవ్వగా వారిలో 10 వేల మంది లబ్ధి కూడా పొందారన్నారు. అయితే అప్పట్లో పిల్లలుగా ఉన్న 4 వేల మంది పెద్దవారు కాగా వారి పేర్లు చేర్చాలను ఆయా కార్డుల్లో చేర్చడంపై సానుకూలంగా ఉన్నామన్నారు. అలానే కొత్త పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు కూడా విచారణ జరిపి ఇస్తామన్నారు.

గుర్తింపుతోనే సరి

(5వ పేజీ తరువాయి)

ఆమోదం లభించిన తర్వాత నిర్మాణం చేపట్టాలి. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో భవనాల నిర్మాణాలు ప్లాన్ ప్రకారం జరగడంలేదని తెలుస్తోంది. యథేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. మామూళ్ల వసూళ్లతోనే అక్రమ నిర్మాణాలను అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఎవరైనా ఇల్లు కట్టుకుందామని పునాది వేస్తే టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షణాల్లో వాలిపోతారు. అనుమతులున్నాయా? లేదా అని పరిశీలించి, అనుమతులు లేకపోతే ఒక రేటు, ఉంటే మరో రేటు పెట్టి నిర్మాణదారుల నుంచి ముక్కు పిండి మామూళ్లు వసూలు చేస్తారు. అదే అపార్ట్‌మెంట్ అయితే రూ.లక్షల్లో అధికారులకు, ఆయా ప్రాంతాల నేతలకు చెల్లించుకోవాల్సిందే. అక్రమ నిర్మాణాల వివరాలు అధికారులకు తెలిసినా వాటిని పట్టించుకునే వారే లేరు. ఎప్పటికప్పుడు అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్నా.. వాటిపై చర్యలు ఉండటంలేదు. ఎందుకంటే మామూళ్లు తీసుకుని వాటికి అనుమతి ఇచ్చేది అధికారులే కావడమే కారణమని తెలుస్తోంది. ఈ కారణంగానే ప్రభుత్వం బీపీఎస్ ప్రకటిస్తున్నా.. దరఖాస్తులు వస్తున్నాయని సమాచారం. వైసీపీ ప్రభుత్వ కాలంలో అనుమతులతో పనిలేకుండా లెక్కలేకుండా ఇళ్లు కట్టేశారు. బహుళ అంతస్తుల భవనాలయితే సరేసరి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గత నిర్మాణాలు కొన్ని రోజులు కొనసాగాయి. తెనాలిలో అక్రమ నిర్మాణాలను ఆపాలని ఏకంగా మంత్రి మంత్రి మనోహర్ ఆదేశించినా తొలుత కఠినంగా వ్యవహరించిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సా..గుతున్న లెక్కింపు..

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రెండువారాలు అవుతున్నా ఇంకా లెక్క తేలలేదు. అనధికార, అక్రమ కట్టడాల లెక్కింపు ప్రక్రియ సా...గుతూనే ఉంది. ఆగస్టు వరకు నిర్మించిన భవనాలను మాత్రమే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతి ఇస్తే, ఆ తర్వాత జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలను కూడా వీటితోపాటే చూసేందుకు అధికారులే తాత్సారం చేస్తున్నారనే విమర్శ ఉంది. తెనాలిలో ఇప్పటి వరకు కేవలం 850 ఇళ్లనే గుర్తించడంపై విమర్శలు వస్తున్నాయి. పొన్నూరు పురపాలక సంఘంలో అనధికార కట్టడాలను గుర్తించి యజమానులతో దరఖాస్తు చేయించేందుకు అధికారులు సచివాలయాల వారీగా సర్వే చేపట్టారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 3 వేల వరకు అనధికార కట్టడాలు ఉన్నట్లు అధికారుల అంచనా. అయితే ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా మున్సిపాలిటీకి రాలేదు. వినుకొండలో బీపీఎస్‌కు కేవలం 10 దరఖాస్తులు అందాయి. నరసరావుపేటలో సూమరు 500 అపార్ట్‌మెంట్లు, ఇతర భవనాలను ఉండగా బీపీఎస్‌కు రెండు దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి.

అవీ..ఇవీ..

పట్టాలు దాటుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

● చీరాల రైల్వే స్టేషన్‌లో ఘటన

చీరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతూ గుర్తు తెలియని వ్యక్తి (50) మృతిచెందిన ఘటన స్టేషన్‌లో చోటుచేసుకొంది. సదరు వ్యక్తి నుంచి విఠల్‌నగర్ నగర్ వైపు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా గూడ్స్‌రైల్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ప్రయాణీకులు నివ్వెర పోయారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు స్థానికుడిగానే పోలీసులు భావిస్తున్నారు.

రైలు నుండి జారిపడి అస్సాం వాసి మృతి

రైలు నుండి జారిపడి అస్సాం వాసి మృతిచెందిన ఘటన కడవకుదరు గ్రామ సమీపంలో చోటుచేసుకొంది. అస్సాం రాష్ట్రం బిశ్వనాథ్ జిల్లాకు చెందిన వీరునాయక్(35) మరో పదిమంది సహచరులతో కోయంబత్తూర్‌లో పనిచేసేందుకు వెళుతున్నాడు. మెట్లు వద్ద కూర్చుని నిద్రలో జారిపడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు గుర్తించి శనివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఆయన భార్య టెరీనాయక్ సుమారు ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. పురిట్లోనే కుమారుడు మృత్యువాత పడ్డాడు. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో మృతదేహాన్ని సమీప బంధువులకు అప్పగించారు.

తల్లిచెంతకు బాలిక

● ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలిక
● గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మార్టూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో అమ్మ కోపగించుకొందని ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలికను పోలీసులు గుర్తించి, అరగంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం సాయంత్రం మార్టూరు లో చోటుచేసుకొంది. బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన బాలిక బల్లికురవ జడ్పి హైస్కూల్ లో 9 వతరగతి చదువుతోంది. అయితే అమ్మ తిట్టిందనే కారణంతో ఇంటి నుంచి బయటకు వచ్చింది. నాగరాజుపల్లి కూడలిలో ఒంటరిగా నిలబడి ఏదో ఒక బస్సు ఎక్కడానికి ప్రయత్నించింది. అయితే అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సైదా, ఏఎస్‌ఐ ఎస్‌కె మహబూబ్‌బాషాలు బాలికను గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంటనే బాలిక తల్లిని పిలిపించి బాలికను ఆ మెకు అప్పగించారు. తరువాత మహిళా కానిస్టేబుల్ అనిత తల్లికుమార్తెలను దగ్గరుండి ఆర్‌టీసీ బస్సులో నక్కబొక్కలపాడు గ్రామానికి పంపించారు.

273 మందికి వైద్య పరీక్షలు


రోగులకు పరీక్షిస్తున్న వైద్యుడు

చినగంజాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామంలోని సచివాలయ ఆవరణలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామసర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు వైద్యశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈ శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించి 273 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 50 మందిని ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. వైద్యశాలలో ఆరోగ్యశ్రీ, ఈఎస్‌ఐ, ఈసిహెచ్‌ఎస్, రైల్వే, ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. ఆప్తమాట్రిక్స్ సాగర్ కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, గుండె, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్ రామాంజనేయులు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

అద్దంకి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు ఆదివారం అద్దంకి, మార్టూరులలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలో ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ, నెల చివరి రోజు కావడంతో వినియోగదారులు బిల్లులు చెల్లింపునకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేర ప్రవృత్తిని విడనాడండి

● రూరల్ సీఐ శేషగిరిరావు


పాత నేరస్థులకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ శేషగిరిరావు

చీరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు ప్రవృత్తిని మార్చుకోకుంటే శిక్షలు తప్పవని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం రూరల్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్సైలు చంద్రశేఖర్, జనార్ధన్‌లతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల కాలంలో కేసులకు సంబంధించి వారి పాత్రలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వారి జీవనశైలిపై నిఘా ఉంచినట్లు సూచించారు. సత్ప్రవర్తన కలిగి కుటుంబాలతో సంతోషంగా గడపాలని, భిన్నంగా వ్యవహరిస్తే జైలు జీవితం తప్పదని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలతో సంపూర్ణ ఆనందం

చీరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత సమయంలో ఇతరులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం వలన సంపూర్ణ ఆనందం ఉంటుందని పలువురు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వాకర్స్ మాజీ అధ్యక్షులు అమరా వీరాంజనేయులు పెళ్లిరోజు కావడంతో శనివారం స్థానిక కోటయ్య ఆశ్రమం, చైతన్య మనోవికాస కేంద్రాలకు బియ్యం అందజేశారు. అలాగే శ్రీకృష్ణ గోశాలకు నగదు ఆర్థిక సాయం చేశారు. దీంతో వాకర్స్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

ముప్పవరంలో టైర్ల దుకాణంలో టైర్లు దగ్ధం

● లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం


దగ్ధమవుతున్న టైర్లు

పంగులూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న టైర్ల దుకాణంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అందిన సమాచారం గ్రామానికి చెందిన యర్రంశెట్టి రామాంజనేయులుకు చెందిన టైర్ల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానిక యువకులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూ అద్దంకి ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ముప్పవరం చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే దుకాణంలో ఉన్న టైర్లు మంటల్లో దగ్ధమయ్యాయి. లక్షన్నర రూపాయల వరకు ఆస్తినష్టం ఉంటుందని భావిస్తున్నారు.

సాగర్ కాలువలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష

నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ చక్రపాణి



మాట్లాడుతున్న నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్ట్ కమిటి వైస్ చైర్మన్ చక్రపాణి

మార్టూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల పరిధిలో వచ్చే వేసవిలో చేపట్టాల్సిన పనులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి సూచించారు. శనివారం కోనంకిలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, ఎన్ఎస్‌పీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పరిధిలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు నిమిత్తం రూ.6 కోట్లతో అంచనాలును తయారుచేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా కాలువలో చేపట్టాల్సిన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు పోతామన్నారు. రైతులందరికీ ఉపయోగపడే విధంగా కాలువ అభివృద్ధి పనులు చేయడంపై అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి కార్యక్రమంలో ద్రోణాదుల, ఇంకొల్లు, పర్చూరు సాగునీటి సంఘాల అధ్యక్షులు కే.దిలీప్, శ్రీనివాసరావు, మురళీ కృష్ణ, డీసీ తాటి ఆంజనేయస్వామి, పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

నిరుపేదకు అందిన సాయం


నిత్యావసరాలను అందజేస్తున్న ఎస్సై

నూతలపాడు(పర్చూరు), నవంబరు 29 : పర్చూరు మండల పరిధిలోని కురప్పాలేనికి ఓ వృద్ధ మహిళకు టీడీపీ యువనేత నూతలపాడు పీఏసీఎస్ చైర్మన్ విన్నకోట సతీష్ ఇంటి నిర్మాణం కోసం రూ.లక్ష సాయం అందించారు. సదరు మహిళ ఎమ్మెల్యేకు తన పరిస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వివరించగా, ఎమ్మెల్యే సూచన మేరకు పీ4 పథకంలో భాగంగా సతష్ స్పందించారు. అదే విధంగా మరో కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ఎస్సై జీవీ.చౌదరి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్.షంషుద్దీన్, సొసైటీ డైరెక్టర్ శేఖర్, స్థానిక నేతల సారథ్యంలో రిబ్బన్ కట్‌చేసి గృహప్రవేశం చేశారు. అనంతరం ఎస్సై చేతుల మీదుగా నిత్యవసర సరుకులు అందజేశారు.

ఒకేషనల్ విద్యలో విద్యార్థులకు శిక్షణ

కొండమంజూరు విద్యార్థుల ఫీల్డ్ విజిట్


బిల్లింగ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థినులు

పంగులూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్యనభ్యసిస్తున్న కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ శనివారం అద్దంకిలో నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా అద్దంకిలోని శ్రీ షిరిడిసాయి షాపింగ్‌మాల్, శివప్రియ ఆటోమోటివ్స్‌ను సందర్శించారు. రిటైల్ ట్రేడ్‌లో బిల్లింగ్, బార్‌కోడ్ స్కానింగ్‌తో పాటు వినియోగదారునితో మెలిగే పద్ధతులు, నగదు సేకరణ విధులు, అమ్మకాల గురించి షాపు నిర్వాహకులు నాగసూరి హనుమాన్ వెంకటశివప్రసాద్, విశ్రాంత ట్రైనర్ భావాని ప్రసాద్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆటోమోటివ్ ట్రేడ్‌లో టూవీలర్ స్పేర్ పార్ట్స్, సేల్స్, వెహికల్ రిజిస్ట్రేషన్, వెహికిల్ సర్వీస్ గురించి దుకాణం నిర్వాహకులు బ్రహ్మయ్య, ఆటోమోటివ్ ట్రైనర్ రవీంద్రలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో విద్యార్థులు ప్రాక్టికల్‌గా అనుభవం గడించేందుకు సహకరించిన శివప్రియ ఆటోమోటివ్స్ యజమాని బ్రహ్మయ్య, శ్రీ షిరిడిసాయి షాపింగ్‌మాల్ యజమాని నాగసూరి వెంకట హనుమాన్ శివప్రసాద్‌లకు హెచ్‌ఎం ఎం.అనిత, రిటైల్ ట్రైనర్ గంగాభవాని ప్రసాద్, ఆటోమోటివ్ ట్రైనర్ రవీంద్రలు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

పరిహారం చెల్లించక పోవడంపై ఆగ్రహం


రోడ్డు అడ్డంగా గొయ్యి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పరిహారం చెల్లించకుండానే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు చేస్తుండటంతో కొటికలపూడి గ్రామస్థులు ఆగ్రహించారు. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా అద్దంకి మండలంలోని కొటికలపూడి రెవెన్యూ పరిధిలో కోదండరామస్వామి దేవాలయానికి చెందిన భూమితో పాటు మరి కొందరు రైతులకు సంబంధించిన భూమికి పరిహారం చెల్లించాల్సి ఉంది. దీంతో గ్రామస్థులు, రైతులు పలుమార్లు ప్రశ్నించినా, ఏదో ఒక సాకు చెప్తూ పరిహా రం చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారు. అయితే రోడ్డు నిర్మాణ పనులు యథావిధిగా చేస్తునే ఉన్నారు. ఆగ్రహించిన కొటికలపూడి గ్రామస్థులు, భూమి కోల్పోతున్న రైతులు శనివారం తమ పొలం వద్ద వేసిన రోడ్డును ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వించి గాడి తీయించారు. తమకు పరిహారం చెల్లించే వరకు పనులు చేయనివ్వమని తేల్చి చెప్పారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.

మహిళా ఉపాధ్యాయినుల త్రోబాల్ జట్టు ఎంపిక


త్రోబాల్ జట్టు ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

పంగులూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల మహిళా ఉపాధ్యాయినుల త్రోబాల్ జట్టు ఎంపిక శనివారం నిర్వహించారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల త్రోబాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని హెచ్‌ఎం సోమేపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ జట్టుకు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఐ.అనిత, పద్మావతి (ఎస్.ఎ/గణితం), జి.ఆదిలక్ష్మి (ఎస్‌జీటీ), ఎ.కాంతికళ(ఎస్‌జీటీ) కొండమంజులూరు, బి.అనిత(ఎస్‌ఏ, గణితం), సీహెచ్.పద్మావతి (ఎస్‌ఏ బయాలజి) తూర్పుకొప్పెరపాడు, సీహెచ్. కృష్ణవేణి(ఎస్‌జీటీ) జనకవరం, షేక్‌మీరాబీ (ఎస్‌జీటీ) ముప్పవరం, ఇ.స్వర్ణలత(ఎస్‌జీటీ), బైటమంజులూరు, కొండా ప్రతిమ(ఎస్‌ఏపీడీ) చందలూరు, ఎ.అంజమ్మ(ఎస్‌ఏ తెలుగు), షేక్ జలీనాబేగం (ఎస్‌ఏ హిందీ) కోటపాడు, రాధారాణి (ఎస్‌జీటీ) పంగులూరు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ప్రతిమ, మండల సమన్వయకర్త ఏ.హనుమయ్య తెలిపారు. ఈ జట్టు డివిజన్ స్థాయిలో జరిగే ఉపాధ్యాయినుల త్రోబాల్ పోటీలో పాల్గొంటుందన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ఇంకొల్లు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించారు. పురుషులకు క్రికెట్ పోటీలు నిర్వహించగా, స్త్రీలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన టీంను డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థునుల తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీరాల నాగ రత్నం వైద్యశాల డాక్టర్ అంజలి సూచించారు. ఉప్పుగుండూరులోని ఆర్‌వీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల ని చెప్పారు. డైరెక్టర్లు కిషోర్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు


ఏఐసీసీ అబ్జర్వర్ శరత్ అహేర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమంచి కృష్ణమోహన్

అద్దంకి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏఐసీసీ అబ్జర్వర్ శరత్ అహేర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ అహేర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. అందరి సలహాలు, సూచనలతో జిల్లా అధ్యక్షుడి ఎన్నిక చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అద్దంకి నియోజకవర్గ కన్వీనర్ అడుసుమల్లి కిషోర్‌బాబు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చీరాల : ఏఐసీసీ పరిశీలకులు శారద్ అహెర్‌ను ఆమంచి కృష్ణమోహన్ స్థానిక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం పేరాల పద్మశాలి కల్యాణ మండపంలో 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈక్రమం లో శనివారం చీరాలకు చేరుకున్న పరిశీలకులను ఆమంచి కలిశారు. అలాగే కార్యక్రమానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్పు గ్రెగోరీ, జడ్పీటీసీ ఆకురాతి పద్మినీ, కనపర్తి బాబ్జీ, డేవిడ్, బాబు, ఇస్సాక్, శ్రీకాంత్, దేటా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుందేరు వాగు ఆధునికీకరణకు చర్యలు

● చీరాల - బాపట్ల కుందేరు వాగును పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్


వాగును పరిశీలిస్తున్న కలెక్టర్

చీరాల, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : పారుదల సక్రమంగా ఉండే లా చీరాల-బాపట్ల మధ్య ఉన్న కుందేరు వాగు ఆధునీకరించాలని కలెక్టర్ డా.వినోద్‌కుమార్ పేర్కొన్నా రు. శనివారం రాత్రి ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడితో కలిసి కుందేరును పరిశీలించారు. తుఫాన్ ప్రభావాలతో వాగుల్లో పారుదల లేక పంటపొలాల్లోకి నీరు చేరుతున్నట్లు చెప్పారు. అంతిమంగా రైతులు నష్టపోవడంపై మాట్లాడారు. ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రనష్టం వాటిల్లినట్లు వివరించారు. తిరిగి మరో తుఫాన్‌తో ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. కుందేరులో గుర్రపు డెక్క తొలగించి పారుదల సక్రమంగా ఉండే లా జాగ్రత్తలు చేపట్టాలని జలవనరుల అధికారులకు సూచించారు. మత్స్యకారులు కూడా వేటకు వెళ్లరాదని చెప్పారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రవాహం తగ్గిన తరువాత పూర్తిస్థాయిలో డ్రెయినేజీ పనులు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ గోపీకృష్ణ తదతరులు ఉన్నారు.

కేఆర్‌కేలో రేపటి నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్-2 విభాగం విద్యార్థులతో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. షర్మిలరాణి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అనుమతితో డిసెంబరు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దత్తత గ్రామం శింగరకొండపాలెంలో జాతీయ సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు, ఈ శిబిరానికి చైర్మన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ వ్యహరిస్తారన్నారు. గ్రామంలో వారంరోజుల పాటు రోజుకు ఒక్కోక్క కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు నీటి సంరక్షణపై అ వగాహన కార్యక్రమం, మాదకద్రవ్యాల నివారణ, ఆరోగ్యం-పరిశుభ్రత, వైద్య శిబిరం, రోడ్డు భద్రత, స్వచ్ఛ భారత్- వ్యర్థాల యాజమాన్యంపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి 7 రోజున మొక్కలు నాటే కార్యక్రమం, ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం మాదిరి ప్రశ్నాపత్రాల పంపిణీ

పంగులూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న నిర్వహించే నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షకు సంబంధించిన మాదిరి ప్రశ్నా పత్రాలు, ఓఎంఆర్ షీట్లను అజిత్ ట్రస్ట్ చైర్మన్ వి.వీరనారాయణ శనివారం పలు పాఠశాలలకు అందజేశారు. పోటీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ముందస్తు అవగాహన కోసం ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించిన మాదిరి ప్రశ్నాపత్రాలను పలు పాఠశాల హెచ్‌ఎంలకు అందజేశారు. పంగులూరు మండలంతో పాటు ఎనిమిది మండలాలలోని 35 పాఠశాలల నుంచి పరీక్షకు హాజరవుతున్న 500ల మంది 8వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు సమకూర్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షకు సంసిద్ధులను చేసేందుకు ఉపకరించే మాదిరి ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు సమకూర్చిన ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణకు పాఠశాలల హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో గుండ్లకమ్మ రిజర్వాయర్ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బరాజు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పాటు గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలన్నారు.

రేపటి నుంచి క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని డిసెంబరు 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజు క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేకల మేషక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో సోమవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి 6గంటల వరకు ప్రతి రోజు క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యారల్స్ ర్యాలీలో సండే స్కూల్ చిన్నారులు, యువతి యువకులు, పెద్దలు పాల్గొనాలని కోరారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషీ టర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎ స్పీ ఆర్.శ్రీనివాసరావు హె చ్చరించారు. శనివారం ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేష న్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలి ంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడినా, చ ట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. సత్ప్రవర్తన ఒక్కటే మార్గమన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లం ఘించి గొడవలు, అల్లర్లు చేసే వారి ఆస్తులు జప్తి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాంబశివయ్య, ఫిరోజ్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలి


పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం రామారావు

కొండపి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు బోర్డు అనుతించిన విస్తీర్ణం మేరకే పొగాకు సాగు చేయా లని ఒంగోలు ఆర్‌ఎం శీలం రామారావు సూచించారు. పంట నాణ్యతకు అనుగుణంగా ధరలు ఇప్పించేందు కు బోర్డు కృషి చేస్తుందని చెప్పారు. శనివారం ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. సిబ్బందితో స మీక్ష నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారానికి పారదర్శకంగా, జవాబు దారీతనంతో పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. రైతులు అధిక రేట్లకు పొలాలు, బ్యారన్లు కౌలుకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, చతుకుపాడు, గుర్ర ప్పడియ, నరసరాజుపాలెం, కె.అగ్రహారం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రూ.కోటి అవినీతి ఎలా సాధ్యం : వైసీపీ

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సొసైటీ భవన నిర్మాణానికి అయిన ఖర్చు రూ.98లక్షలు కాగా అందులో కోటిరూపాయలు అవినీతి ఎలా సాధ్యమని సొసైటీ మాజీ అధ్యక్షులు దుంపా యలమందారెడ్డి, మాదాల వెంకట్రావు, వైసీపీ మండల కన్వీనర్ దుం పా చెంచిరెడ్డి ఆరోపించారు. శనివారం సంతనూతలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలనపై అసత్య ప్ర చారం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్లు మోహన్ రావు, కోటేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

రైతుల వివరాలను నమోదు చేయాలి

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతన్నా మీకోసం కార్యక్ర మంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న రైతు కుటుంబాల సర్వేలో రైతుల వి వరాలను ఏపీఎయిమ్స్ యాప్‌లో నమోదు చేయాలని డీఏవో ఎస్.శ్రీనివా సరావు ఆదేశించారు. మంగమూరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, ఏవో పావని, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు నల్లూరి క్రిష్ణారావు, నా యకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు పాల్గొన్నారు.